

హౌసింగ్ పీడీపై విచారణకు ఆదేశం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్‌పై విచారణకు ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో నవరత్నాలు.. పేదలకు ఇల్లు పథకానికి సంబంధించి ఏలూరు జిల్లాలో పని చేసిన వేణుగోపాల్‌పై ఆరోపణలు రావటంతో ప్రస్తుత ప్రభుత్వం గతంలోనే వివరణ కోరింది. ఆయన ఇచ్చిన వివరణ సంతృప్తిగా లేకపోవటంతో తాజాగా శాఖాపరమైన విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రత్యేక అధికారులను కూడా నియమించింది. అలాగే మరో నాలుగు జిల్లాల అధికారులపైనా విచారణ చేపట్టాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



కమ్మేస్తున్న కాలుష్యం

- పరిశ్రమల వల్ల పెరుగుతున్న వైనం
- రసాయనాల పట్ల అప్రమత్తత అవసరం
- నిబంధనలు పాటించాలంటున్న అధికారులు
- నేడు జాతీయ కాలుష్య నివారణ దినం

పెంచలయ్య హత్యకు నిరసనగా

నేడు జిల్లా బంద్

- సీపీఐ, ఇన్సాఫ్ నాయకులు
- లేడీ డాన్ ఇల్లు కూల్చేసిన స్థానికులు
- మా ప్రాంతానికి కామాక్షి ముఠాను రానీయం

నేరాలు చేయం.. సత్ప్రవర్తనతో ఉంటాం!

నెల్లూరులో రౌడీషీటర్లతో ర్యాలీ

ఆపై నేర కార్యకలాపాల్లో పాల్గొనబోమంటూ ప్రమాణం



8లో..



కావలిలో ఇళ్లముందు నిలబడిన వర్షపు నీరు

సంగంలో నీటమునిగిన వరి నారుమళ్లు

దిత్వా.. దిగులు

- రోజంతా మోస్తరు నుంచి భారీ వర్షం
- నేడు కూడా వాన
- 208 హెక్టార్లలో నీటమునిగిన వరి
- తీరప్రాంతాల్లోనే జిల్లా యంత్రాంగం
- పరిస్థితిని ఆరా తీస్తున్న మంత్రులు ఆనం, నారాయణ

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ ప్రభావం నెల్లూరు జిల్లాపై తీవ్రంగా కనిపిస్తోంది. సోమవారం వేకువజాము నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఇంటిలో నుంచి అడుగు బయటకు పెట్టలేని విధంగా పరిస్థితులు ఉండడంతో జనజీవనం స్తంభించింది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురవగా, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జిల్లాలో సరాసరి 10.5 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా నెల్లూరు నగరంలో 46.2 మి.మీ, వెంకటాచలంలో 32.4 మి.మీ, కోవూరులో 29.6 మి.మీ, నెల్లూరు రూరల్‌లో 25.8 మి.మీ చొప్పున వర్షం కురిసింది. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇంకొన్ని చోట్ల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జిల్లాలో ఇప్పుడిప్పుడే నార్లు పోసుకోవడం, నాట్లు వేస్తుండటంతో ఈ వర్షం రైతాంగానికి తీవ్ర ఇబ్బందిగా మారింది. 208 హెక్టార్లలో వరి పంట నీట మునగగా, మరో 80 హెక్టార్లలో నారుమడులు మునిగినట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమికంగా గుర్తించారు. కావలి, జలదంకి, కోవూరు, సంగం, బుచ్చి ప్రాంతాల్లో ఎక్కువగా నష్టం జరిగింది. మంగళవారం కూడా - మిగతా 6వ పేజీలో..

నీట మునిగిన వరినాట్లు, నారుమళ్లు

కావలి, (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కావలి ప్రాంతంలో అనేక చోట్ల వరి నాట్లు, నారుమళ్లు నీట మునిగాయి. కావలి సబ్‌డివిజన్ పరిధిలోని కావలి, అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాల్లో 200 ఎకరాలలో వరి నారుమళ్లు దెబ్బతిన్నాయని కావలి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నాగ రాజు తెలిపారు. అలాగే మరో 500 ఎకరాలలో వరినాట్లు నీట మునిగాయని నీరు తగ్గితే కాని వాటి పరిస్థితి తెలియదన్నారు. ఇంతటితో వర్షం ఆగిపోతే పెద్దగా నష్టం ఉండకపోవచ్చని పేర్కొన్నారు. జలదంకి మండలంలో 5 వేల ఎకరాల వరకు వరినాట్లు నీట మునిగాయి. వర్షం తగ్గి నీరు బయటకు వెళితే కానీ నష్టం తెలియదని రైతులు అంటున్నారు. కావలిలో శివారు కాలనీలు, పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి.



జలదంకిలో నీటమునిగిన వరి నారు



నెల్లూరు నగరంలోని ముత్యాలపాలెంలో వర్షపునీటితో రొచ్చురొచ్చుగా మారిన రోడ్డు

కసురు మీదున్న కడలి



చిట్టగుంట, (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ఎఫెక్ట్‌తో కడలి కసురుమీదుంది. సముద్ర అలలు ఎగసి పడుతుండటంతో తీరప్రాంత గ్రామాల అధికారులను, సచివాలయ సిబ్బందిని తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి అప్రమత్తం చేశారు. ఎస్‌ఐ ప్రభాకర్ తన సిబ్బందితో తీరప్రాంతంలో పర్యటించి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సైచించారు.



అల్లూరు : రామన్న చెరువు కలుజును పరిశీలిస్తున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ



కొడవలూరు : ఉధృతంగా ప్రవహిస్తున్న పైడేరు

'సోమశిల'కు పెరుగుతున్న వరద

అనంతసాగరం డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద పెరుగుతోంది. సోమవారం 11,011 క్యూసెక్కులు వస్తుండగా 68.815 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 2,650, కండలేరు డ్యాంకు 2వేల క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.

- **కండలేరు ఇన్‌ఫ్లో...**

రాపూరు : కండలేరు డ్యాంకు 4,480 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 58.33 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1090 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

- **పొంగి ప్రవహిస్తున్న వాగులు**

చేజర్ల, (ఆంధ్రజ్యోతి) : తుఫాను నేపథ్యంలో మండలంలో నుంచి కురుస్తున్న వర్షాలకు టికేపాడు సమీపంలోని నల్లవాగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో చేజర్ల నుంచి టికే పాడు, కోటితీర్థం, యనమదల, కాకివాయి తదితర గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. అదేవిధంగా గొల్లపల్లి సమీపంలో పందలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చేజర్ల నుంచి సంగంకు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, మండలంలోని చలపనాయుడుపల్లి సమీపంలో పెన్నానది పొర్లుకట్ట మీద ఉన్న గిరిజన కుటుంబాలను తహసీల్దారు ఆర్.మస్తానయ్య సురక్షిత కేంద్రాలకు తరలించారు. వాగుల వద్ద ప్రజలు దాటకుండా ఉండేలా పోలీసులను ఏర్పాటుచేసినట్లు ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.




టికేపాడు సమీపంలో నల్లవాగు ఉధృతి

వీఆర్వో సంతకం ఫోర్జరీ

అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసే యత్నం

పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దారు ఫిర్యాదు

- వివరాలు 6లో..



ఐటీడీఏ పీవోగా సుజాత



నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (ఎఫ్ఏసీ)గా కే సుజాతను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుజాత జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారిగా పనిచేస్తున్నారు. ఆమెకు పీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పీవోగా పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డి సీఆర్‌డీఏకు డిప్యుటేషన్‌పై బదిలీ అయిన విషయం విదితమే.

పింఛన్ నగదు పోయిందని డ్రామా

తోటపల్లిగూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పేదలకు పంపిణీ చేసే పింఛన్ నగదు తీసుకువస్తున్న బ్యాగ్ పోయిందని డ్రామా ఆడడంతో పోలీసులు మందలించారు. ఈ ఘటన తోటపల్లిగూడూరు మండలం వరిగొండ బిట్-1 సచివాలయంలో సోమవారం చోటుచేసుకుంది. సచివాలయంలో పనిచేస్తున్న మత్స్యశాఖ సహాయకులు వెంకటేశ్వర్లు సోమవారం ఉదయం పింఛన్లు పంపిణీ చేసేందుకు వస్తుండగా, 6గంటల సమయంలో రావూరివారికండ్రిగ, దేవరపాలెం మధ్యలో నగదు తీసుకువస్తున్న బ్యాగ్ బైక్ నుంచి జారి పడిపోయిందని, ఆ బ్యాగ్‌లో రూ.2,18,000 నగదు ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వర్షానికి రెయిన్ కోట్ వేసుకుని వస్తుంటే బ్యాగ్ ఎలా జారి పోతుందని పోలీసులు అతన్ని మందలించారు. కాగా మధ్యాహ్నం తర్వాత పింఛన్లు పంపిణీ చేశారు.

90.22 శాతం పింఛన్ల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ నెల 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరిట నిర్వహిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ డిసెంబరు నెలకు జిల్లాలో సోమవారం ఉదయమే ప్రారంభమైంది. జోరున వర్షం కురుస్తున్నప్పటికీ తొలిరోజు 90.22 శాతం పెన్షన్లను పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 3,04,117 పింఛన్లకుగాను 2,74,383 పింఛన్లు పంపిణీ చేశారు.

- **జోరువానలోనూ...**

సంగం : ఓ వైపు వర్షం కురుస్తున్నా జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రజాప్రతినిధులు, అధికారులు లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. సంగం మండలంలోని గాంధీజన సంఘం గిరిజన కాలనీలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. జోరు వానను సైతం లెక్క చేయక పేదల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నెల్లూరు నగరం 11వ డివిజన్‌లో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ పెన్షన్ల పంపిణీలో పాల్గొన్నారు.



సంగం : గాంధీజనసంఘంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం

'కాన'మ్మ జడిలో... 'కోన'మ్మ ఒడిలో...

మానస సరోవరపు తీరంలో.. కొండ కోనల సోయగాల్లో తడిసిన ప్రకృతి కాంతను చూడాలంటే.. వానమ్మ ఒక్కసారైనా రావాల్సిందే! పెంచలకోన జలపాత సోయగం చూడాలంటే.. నింగికీ.. నేలకూ నిచ్చెన వేసే 'దిత్వా' తాలూకు చినుకుల అతిథులు జాలువారాల్సిందే! రా.. రమ్మని పిలిచే పచ్చని చెట్లు.. హేమంతపు సోయగాలకు నెలవైన ప్రకృతి రమణీయత... దేహాన్నీ.. ప్రాణాన్నీ 'జి(థ్రి)ల్'మనిపించే జలపాత సవ్వడి... కణ్వనది చెంతన సహజ సౌందర్యంతో అలరారే ఆకుపచ్చని అందాలు పర్యాటకుల హృదయాల్లో చల చల్లని అనుభూతులు నింపుతున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెంచలకోన జలపాతం వాననీటి వర్షంతో సరికొత్తగా ముస్తాబైంది. కాస్త విరామం తర్వాత.. పెంచలకోన జలపాతం మళ్లీ.. రాపూరు నుదుటిపై తెల్లగా తీసిన పాపిట బొట్టులా అగుపిస్తుండడంతో ప్రకృతి ప్రేమికులు మనసారా ఆస్వాదిస్తున్నారు. కోన ఒడిలో ప్రవహించే సెలఏళ్ల ధ్వనులను వింటూ మంత్రముగ్ధులవుతున్నారు.

- రాపూరు, (ఆంధ్రజ్యోతి)

'ఉపాధి'లో నకిలీలకు చెక్!

కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు

ముఖ ఆధారిత హాజరు, ఆధార్ లింక్

28,352 జాబ్‌కార్డుల తొలగింపు

నెల్లూరు,(జడ్పీ), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. ఆ ప్రకారం జిల్లావ్యాప్తంగా 3,01,771 జాబ్‌కార్డులు ఉండగా 28,352 కార్డులను రద్దు చేస్తూ డ్వామా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధి హామీ పథకంలో ఇప్పటివరకు పనులు చేస్తున్న కూలీల ఫొటోలు తీసి ఇష్టప్రకారం కూలీల సంఖ్యను జోడించి కొంతమంది ఉద్యోగులు, సిబ్బంది అక్రమాలకు, అవినీతికి పాల్పడుతున్నారు. బయట ప్రాంతాల్లో ఉన్నవారి పేర్లతో జాబ్ కార్డులను పొంది వారంతా స్థానికంగా పనులు చేస్తున్నట్లు చూపిస్తూ నిధులను దిగమింగుతున్నారు. దీనిపై ఫిర్యాదులు వస్తుండటంతో ఉపాధి హామీ పథకంలో నిబంధనలను మారుస్తూ కేంద్రం తాజాగా నిర్ణయం తీసుకుంది. పనులకు వచ్చే కూలీల ఫొటో ఆధారం కాకుండా ముఖ ఫొటోని నాలుగు గంటల వ్యవధిలో రెండు సార్లు తీయడం, దానిని ఆధార్‌కి అనుసంధానం చేసేలా నిబంధన విధించింది. దీంతో నకిలీ జాబ్‌కార్డులతోపాటు మృతుల జాబ్‌కార్డులు, అనారోగ్యంతో బాధపడుతూ పనులకు రాని వారి జాబ్‌కార్డులు మొత్తం వెలుగులోకి వస్తున్నాయి. వాటన్నిటిని అధికారులు రద్దు చేస్తున్నారు. జిల్లాలోని 37 మండలాల పరిధిలో 3,01771 జాబ్‌కార్డులు ఉండగా వాటన్నింటికి ముఖ ఆధారిత ఫొటోలు తీసి ఆధార్‌తో లింకు చేస్తున్నారు. దీంతో పనులకు వచ్చే కూలీల జాబ్‌కార్డులు మాత్రమే ఉంటున్నాయి. మిగిలినవన్నీ రద్దు అవుతున్నాయి. కాగా, కొన్ని ప్రాంతాల్లో ఈ అవినీతి వ్యవహారాలు ఆడిట్ ద్వారా వెలుగులోకి రావటంతో బాధ్యులపై చర్యలు తీసుకుంటూ సొమ్ము రికవరీకి చర్యలు చర్యలు చేపడుతున్నారు.

మండలం	ఉన్నవి	రద్దు
వెంకటాచలం	8,892	1,888
రాపూరు	9,868	1,708
వింజమూరు	7,757	1,668
అనంతసాగరం	8,564	1,403
దుత్తలూరు	5,760	1,330
పొదలకూరు	13,300	1,204
కలిగిరి	10,256	1,182
సైదాపురం	8,181	1,179
ఉదయగిరి	9,278	991
ఏఎస్‌పేట	6,466	953
కలువాయి	8,461	887
వరికుంటపాడు	7,563	877
ఇందుకూరుపేట	7,392	873
చేజర్ల	7,383	868
మర్రిపాడు	8,435	844
వలేటివారిపాలెం	10,215	837
సీతారామపురం	5,958	834
మనుబోలు	5,962	830
ముత్తుకూరు	5,939	814
కొండాపురం	9,978	688
బోగోలు	8,260	687
ఆత్మకూరు	6,857	622
నెల్లూరు రూరల్	5,164	616
జలదంకి	8,537	553
గుడ్లూరు	12,308	525
సంగం	6,894	489
ఉలవపాడు	10,415	454
దగదర్తి	9,433	435
లింగసముద్రం	9,917	311
విడవలూరు	6,764	295
కావలి	13,049	293
కొడవలూరు	6,333	286
కోవూరు	4,659	244
బుచ్చి	5,421	227
టీపీ గూడూరు	8,316	200
కందుకూరు	9,160	188
అల్లూరు	4,676	87

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

తోటపల్లిగూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాను పట్ల మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు సుధీర్ తెలిపారు. మత్స్యకార గ్రామాలైన రవీంద్రపాళెం, పాతపట్టపుపాలెం, నడుముపాలెం, ఈదురువారిపాలెం గ్రామాలను సోమవారం ఆయన సందర్శించారు. అనంతరం దిత్వా తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామన్నారు. మత్స్యకారులె వరూ వేటకు వెళ్లొద్దని, అవసరమైతే తప్ప ఎవరు బయటికి రావద్దన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12368
వెండి కిలో ధర	రూ. 179200
వెండి ఒక గ్రాము	రూ. 184.20

దిత్వా తుఫాన్.. ప్రజలు పరేషాన్!

- నీటమునిగిన నార్లు
- నిండుతున్న చెరువులు, వాగులు
- తీరప్రాంతాల్లో అధికారుల పర్యటన

మనుబోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ వల్ల సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. రోజంతా చిత్తడి వానతో కూలీలు, ప్రజలు పనులు చేసుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ సీజన్ కావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలుల వేగం ఎక్కువగా లేకపోవడంతో ఎక్కడా ఎలాంటి నష్టాలు జరగలేదు. కాలువలకు, చెరువులకు ఎగువ నుంచి నీరు వస్తుండడంతో వాటితో మనుబోలు, చుట్టుపక్కల గ్రామాల్లో పంట పొలాలు జలమయమయ్యాయి. ముందుగానే వేసిన నార్లన్నీ చాలావరకు నీటమునిగాయి. ఎక్కువ రోజులు నారు నీళ్లలో ఉంటే ఎక్కడ దెబ్బ తింటుందోనని రైతన్నలు దిగులు చెందుతున్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు మండలంలోని తీరప్రాంత గ్రామాలైన కొలనుకుదురు, పల్లిపాళెం, వెంకన్నపాళెం, పిడూరుపాళెం, బద్దెవోలు గ్రామాలతో పాటు మనుబోలు కండలేరు వాగును తహసీల్దార్ రమాదేవి, సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ శివరాకేష్‌లు పరిశీలించారు. తీరప్రాంతాల్లో లోతట్టు కాలనీల్లో ఉండే దళిత, గిరిజనులకు దిత్వా తుఫాన్‌పై అవగాహన కల్పించారు.

కోవూరు: మండల పరిధిలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు కుండపోతగా వర్షం కురిసింది. లోతట్టు కాలనీలన్నీ జలమయమయ్యాయి. పొలాలు, కాలువ ల్లోకి వర్షపు నీరు చేరింది. పడుగుపాడు నుంచి జమ్మి పాళెం


మనుబోలు: నీట మునిగిన పొలాలు

వెళ్లే గ్రావెల్ రోడ్డు ధ్వంసమైంది. కోవూరు- ఇనమడుగు రోడ్డులో వాన నీరు నిల్వ ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దినసరి కూలీలు పనుల్లోకి వెళ్లలేకపోయారు. పాటూరులోని చేనేత కార్మికులు ఇబ్బందులు పడ్డారు. కోవూరు, పడుగుపాడు ఇనమడుగు, పాటూరు గ్రామాల్లో ప్రధాన వీధుల్లో వర్షపునీరు నిలిచింది. తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కంట్రోలు రూమ్ నుంచి వివరాలు రాబట్టారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాల్సిందిగా ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి పంచాయతీ కార్యదర్శుల్ని కోరారు.

బుచ్చిరెడ్డిపాళెం: ఎడాతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలో జనజీవనం స్తంభించింది. చిన్న, సన్నకారు రైతులు, కూలీల పనులకు ఆటంకం ఏర్పడింది. పొలాలు, వాగులు, వంకల్లో నీళ్ళు పారుతున్నాయి. జొన్నవాడలో పెన్నా పరీవాహక ప్రాంతం, గిరిజన కాలనీని తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు పరిశీలించి గిరిజనులతో మాట్లాడారు. వానకు పనులు లేకపోవడంతో పూటగడవడమే కష్టమైందని గిరిజనులు వాపోయారు. పెన్నానదిలోకి వెళ్లవద్దని గిరిజనులకు సూచించారు.


కోవూరు- ఇనమడుగు మార్గంలో నిలచిన వర్షపు నీరు

కొడవలూరు : మండలంలో సోమవారం జోరుగా వర్షం కురిసింది. కాలువలు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. ఎడతెరపి లేని వర్షంతో జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. పైడేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గండవరానికి, పెయ్యాలపాలెంకు రాకపోకలు స్తంభించాయి.

విడవలూరు: వర్షాలకు నీటమునిగిన వరి, వేరుశనగ పంటలను అన్నారెడ్డిపాళెం, ఊటుకూరులో సోమవారం వ్యవసాయాధికారి లక్ష్మి పరిశీలించారు. విత్తనం వేసిన రెండు, మూడు రోజులు నీటిలో ఉండిపోతే మొలక శాతం తగ్గుతుందని, వీలైనంతవరకు నీటిని తీసి వేయాలన్నారు.

పొదలకూరు : వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో, రోడ్లపై నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. నియోజకవర్గంలో వానకు వరినాట్లు దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. తీర మండలాలైన ముత్తుకూరు, టీపీ గూడూరులో తుఫాను ప్రభావం పెద్దగా లేదు.


బుచ్చి: గిరిజనులతో తహసీల్దారు వెంకటేశ్వర్లు


విడవలూరు: పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారిణి లక్ష్మి


టీపీ గూడూరులో మత్స్యకార గ్రామాలను సందర్శిస్తున్న తహసీల్దారు

రేషన్ షాపు అప్పగించాలని ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న నారాయణమ్మ

రాపూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాపూరు మండలం సిద్దవరం పంచాయతీ లోని కోటూరుపాడు గ్రామానికి చెందిన మోడిబోయిన నారాయణమ్మ రేషన్ షాపును అప్పగించాలని రాపూరు రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవితేజకు అర్జీ ఇవ్వడం జరిగింది. గత డీలర్ కోటూరుపాడు గ్రామానికి చెందిన గుమ్మా అశోక్ ప్రభుత్వ వ్యవసాయశాఖలో పని చేస్తూ, సరుకులు సకాలంలో ఇవ్వకుండా ఉండడం వల్ల, అతని రిజిస్ట్రేషన్ రద్దు చేసి, తమకు ఆర్డర్ కాపీ ఇచ్చి 15 రోజులు అయిందన్నారు. అయినా రేషన్‌కు సంబంధించిన ఈ-పాస్ మిషన్, సరుకుల లెక్కలు, వేయింగ్ మిషన్ ఇంతవరకు అప్పజెప్పలేదని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు విచారించి రేషన్ షాపు తమకు అప్పగించాలని కోరారు.

వర్షంలోనూ ఆగని పింఛన్ల పంపిణీ


ఇందుకూరుపేట: పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎంఎస్ఎంఈ డైరెక్టర్ వీరేంద్ర

కోవూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు భారీ వర్షం కురుస్తున్నప్పటికీ గ్రామాల్లో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఫించన్లు పంపిణీ చేశారు. కోవూరు పంచాయతీ పరిధిలోని కాలనీల్లో ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఫించన్లను అందచేశారు. ఇనమడుగు, వేగూరు గ్రామాల్లో టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, కరేటి అమరావతి ఫించన్లను పంపిణీ చేశారు.

తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరు, తోటపల్లిగూడూరు, ఈదూరు, కోవెరపాలెం, గ్రామాలలో సోమవారం టీడీపీ నేతలు జోరు వర్షాన్ని కూడా లెక్కచేయకుండా పేదలకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం టీడీపీ నేతల మాట్లాడుతూ ఎన్ని అవాంతరాలు ఎదురైనా 1వ తేదీ కూటమి ప్రభుత్వంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొణతం రఘుబాబు, మండల ప్రధాన కార్యదర్శి మన్నెం జితేంద్ర, మన్యం మధుగౌడ్, నీటిపారుదల అధ్యక్షుడు రాపర్ల మల్లికార్జునచౌదరి, ముత్యాల శ్రీనివాసులు, తలమంచి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: మండలంలోని జగదేవిపేట గ్రామ పంచాయతీ పరిధిలో నిరహించిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్టేట్ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రావెళ్ల వీరేంద్ర నాయుడు పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకటి వెంకటేశ్వర్లురెడ్డి, బొల్లినేని హరి నాయుడు, బొల్లినేని రవినాయుడు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: ఓ వైపు ఎడాతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా సచివాలయాల సిబ్బంది సోమవారం పింఛన్ల బ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. వాతావరణం కారణంగా ఐతే సర్వర్లు సరిగా లేకపోవడంతో సచివాలయాల సిబ్బంది ఇబ్బందులు పడ్డారు.

రహదారి నిర్మించాలి


ర్యాలీ చేస్తున్న ఆవాజ్ సభ్యులు

ముత్తుకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముత్తుకూరు బీసీ కాలనీ నుంచి మామిడిపూడి వెళ్లే రోడ్డును వేయాలని ఆవాజ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సాయిబాబా గుడి నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ పలు గ్రామాలకు వెళ్లే ప్రధానమైన రోడ్డు కొన్ని ఏళ్లుగా గుంతలమయంగా మారి విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో గుంతలు కనపడక చాలా మంది పడిపోయిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఈ రోడ్డుపై వచ్చే దుమ్ముతో రోడ్డు పక్కన ఉన్న షాపుల వారు కూడా అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి వీలైనంత త్వరగా ఈ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు గడ్డం అంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాధయ్య, శ్యామ్ ప్రసాద్, ఆవాజ్ మండల అధ్యక్ష కార్యదర్శులు షేక్.అక్బర్, షేక్ మోహిద్, సహాయ కార్యదర్శి షేక్.మస్తాన్, ఉపాధ్యక్షుడు షేక్.సిరాజ్, కమిటీ సభ్యులు అల్లాబక్షు, రబ్బానీ, అలీ, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు చంద్రబాబుకే సాధ్యం

ఎమ్మెల్యే సోమిరెడ్డి


వృద్ధుడిని పలకరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడం సీఎం చంద్రబాబుకే సాధ్యమని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం కప్పలదొరువు, మల్లూరు గ్రామాల్లో పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, పేదలకు సంబంధించిన పథకాల అమలుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దేశంలో పేదలకు పింఛన్ల కోసం అత్యధిక మొత్తం ఖర్చు చేస్తున్నది మన రాష్ట్రమేనన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రతినెలా 16.74 కోట్ల రూపాయల పింఛన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. అన్నదాతల కోసం పలు పథకాలు అమలుచేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల అమలును సజావుగా కొనసాగిస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు పరుగులు తీస్తుందన్నారు. ప్రభుత్వ నిధులకు తోడు సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఊపందుకున్నాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, బొమ్మి సురేంద్ర పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఆదుకోండి!


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ముత్యంగౌడ్

ముత్తుకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో అన్యాయమైన లైసెన్స్ సర్వేయర్లకు తగిన న్యాయం చేయాలని ఏపీ లైసెన్స్ సర్వేయర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నడవడి ముత్యంగౌడ్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ లైసెన్స్ సర్వేయర్ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ ధర్నా చౌక్ దగ్గర పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఐటీఐ, డిప్లమో, బీటెక్ నిరుద్యోగులకు ట్రైనింగ్ ఇచ్చి సర్వేలో అకాడమీ ద్వారా ప్రభుత్వ నిధులతో శిక్షణ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లైసెన్స్ సర్వేయర్లను మండలాల్లో నియ మించారన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి వైసీపీ ప్రభుత్వం లైసెన్స్ సర్వేయర్లను విస్మరించిందన్నారు. ప్రభుత్వం రాగానే న్యాయ మైన ఉద్యోగ భద్రత, లైసెన్స్‌లు రెన్యువల్ గురించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చా రన్నారు. ప్రభుత్వం ఏర్పడి 18నెలలు కావొస్తున్నా లైసెన్స్ సర్వేయర్ల సమస్యలను పట్టించుకో లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్ సర్వేయర్లను విలేజ్ సర్వేయర్లుగా, రిజిస్టర్ ఆఫీసు ల్లోనూ మున్సిపల్ ఆఫీసుల్లోనూ లైసెన్స్ సర్వేయర్‌లుగా నియమించేందుకు తగు చర్యలు తీసుకో వాలన్నారు. లైసెన్స్‌లను రెన్యువల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో సర్వే అడిషనల్ డైరెక్టర్ ఆఫీస్‌ను ముట్టడిస్తామన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రీడా పోటీలు


డివిజన్‌స్థాయికి ఎంపికైన పొదలకూరు ఉపాధ్యాయ క్రికెట్ టీం

పొదలకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక మినీస్టేడియంలో సోమవారం ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు ఉత్సాహంగా ఉపాధ్యాయినులకు టీచర్స్‌కి త్రోబాల్, ఉపాధ్యాయులకు క్రికెట్ క్రీడా పోటీలు నిర్వహించి మండల స్థాయిలో అద్భుతమైన ప్రతిభ చూపించిన ఉపాధ్యాయులను డివిజన్ స్థాయికి ఎంపిక చేశారు. ఈ పోటీలకు ముఖ్య అతిధిగా ఎంపీడీవో నరసింహారావు, ఎంఈవో రేణుక, శోభనాద్రి మాట్లాడుతూ మన మండలం డివిజన్‌లో బాగా ఆడి జల్లా, రాష్ట్రస్థాయి పోటీలలో గెలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపికైన క్రీడాకారులకు క్రికెట్ కిట్స్, త్రోబాల్ కిట్స్ అందజేశారు. ఈ పోటీలకు ఆర్గనైజర్‌గా అమ్మవారిపాలెం ఫిజికల్ డైరెక్టర్ సురేంద్రకుమార్ వ్యవహరించారు. న్యాయనిర్ణేతలుగా వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్, రమేష్, పార్వతి, బాబు, ఈశ్వరయ్య, శివలు వ్యవహరించారు.

వరద బాధితులకు చేయూత


భోజనాలు పెడుతున్న టీడీపీ నాయకులు

విడవలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు నిరాశ్రయులైన పార్లపల్లి గిరిజనులకు స్థానిక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సోమవారం చేయూతని అందించారు. ఈ మేరకు మండల ఇన్‌చార్జీ అడపాల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వరద బాధితులను నూతనంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించి వారికి బోజన, తాగునీటి వసతులను కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఏపూరి సుధీర్‌గౌడ్, టీడీపీ నాయకులు అడపాల జనార్ధన్‌రెడ్డి, పూండ్ల ఏసోబు, వెంకటరమణయ్య, వేగూరు చంద్రారెడ్డి, ఉచ్చూరు సుధీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై కొరడా?

- పనులు అడ్డుకున్న కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ పరిధిలోని అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ లేఔట్లపై కమిషనర్ బాలకృష్ణ కొరడా ఝుళిపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే పలువురు రియల్టర్లు ఏర్పాటు చేసిన లేఔట్లవల్ల మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడింది. పలువురు నాయకులు రియల్టర్లుగా ఏడాది క్రితం పట్టణ నడిబొడ్డులో ఓ సినిమా హాలును కూల్చేసి ఆ ప్రాంతంలో లేఔట్ వేసి కొన్ని ప్లాట్లు కూడా రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం. అయితే, 2 రోజుల క్రితం ఆ లేఔట్‌లోని ఓ ప్లాటులో భవన నిర్మాణానికి యజమానులు పనులు చేపట్టారు. ఈ సమాచారం మేరకు కమిషనర్ బాలకృష్ణ సిబ్బందితో వెళ్ళి నిర్మాణం పనులను అడ్డుకుని పునాదులను పూడ్చేశారు. అయితే కొంతమంది అధికార పార్టీ నాయకులే వాటాలు పెట్టుకుని అనుమతులు లేకుండా లేఔట్లు వేసి అంకణం రూ.9లక్షలకు అమ్ముకుంటూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతుండడంపై స్థానికంగా విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ లేఔట్లో 3 ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీం)లో పెట్టడం గమనార్హం.


కమిషనర్ అడ్డుకోవడంతో ఆగిన ప్లాటు నిర్మాణ పనులు

ఎల్ఆర్ఎస్ స్కీం నిబంధనలు ప్రకారం తీసుకోవాల్సిన చర్యలు అమలవుతాయో లేదో వేచి చూడాలి. బుచ్చిలో సుమారు 20కిపైగా అనుమతులు లేని లేఔట్లు, పబ్లిక్ స్థలాలు అన్యాక్రాంతంలో ఉన్నట్లు సమాచారం.

ఆదాయానికి గండికొడితే ఉపేక్షించేది లేదు

మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు తీసుకోకుండా లేఔట్లు ఏర్పాటు చేయడం, భవనాలు నిర్మిస్తే ఉపేక్షించేది లేదు. త్వరలోనే అనుమతులు లేని లేఔట్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బుచ్చిరెడ్డిపాళెం

ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలి

ఉదయగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్లపడియ పంచాయతీ పప్పులవారిపల్లి గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సోమ వారం ఇన్‌చార్జి తహసీల్దారు షాజియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి ఆక్రమించేందుకు యత్నిస్తుండగా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే ప్రస్తుతం ఆక్రమణదారులు ఆ భూముల్లో జామాయిల్ మొక్కలు నాటేం దుకు సిద్ధం చేశారన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. దీంతో స్పందించిన తహసీల్దారు ప్రభుత్వ భూముల్లో జామాయిల్ నాటకుండా చర్యలు తీసుకుంటామని, ఆక్రమణదారులపై చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

విశాఖపట్నం బస్సును కొనసాగించాలి

ఉదయగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో నుంచి విశాఖపట్నంకు వెళ్లే బస్సును అధికారులు రద్దు చేయాలని చూడడం దారుణమని, ఆ బస్సును అలాగే కొనసాగించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు షేక్ దస్తగిరిఅహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు.

C.R.I.M.E N.E.W.S

వీఆర్వో సంతకం ఫోర్జరీ

- పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దారు ఫిర్యాదు

అనంతసాగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకలీ పత్రాలతో రిజిస్ట్రేషన్‌కు ఉపక్రమిస్తూ అడ్డంగా దొరికిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల మేరకు... మండలంలోని వరికుంటపాడు, ఉప్పలపాడు గ్రామాలకు వీఆర్వోగా జగదీష్ అనే వ్యక్తి విధులు నిర్వహిస్తున్నాడు. అయితే వరికుంటపాడుకు చెందిన ఒక వ్యక్తి వీఆర్వో సంతకంతో భూమి పత్రాలు రిజిస్ట్రేషన్ చేసేందుకు శని వారం ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ అధికారికి అనుమానం కలిగి సంబంధిత వీఆర్వోకి ఫోన్ చేసి సంత కాలు చేసిన విషయంపై ఆరాతీయగా తాను చేయలేదని చెప్ప డంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయింది. ఈ విషయాన్ని వీఆర్వో తహసీల్దారు జయవర్ధన్‌రెడ్డికి తెలపగా ఆయన సోమవారం పోలీ సులకు ఫిర్యాదు చేశారు.

పొలం వివాదం.. వృద్ధురాలిపై దాడి


గాయపడిన బుజ్జమ్మ

కలిగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొలం వివాదంలో ఓ వృద్ధురాలిపై దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని తూర్పు గుడ్లదొనలో సోమవారం జరిగింది. బాధితురాలి కథనం మేరకు... దగదర్తి మండలం లింగాలపాడుకు చెందిన మునగాల బుజ్జమ్మకు తూర్పుగుడ్లదొనలో 12.60 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ క్రమంలో తమ భూములను గ్రామానికి చెందిన కోట ప్రసాద్ కుటుంబీకులు దున్ని నాట్లు వేస్తున్నారనే సమాచారంతో తన ఆడపడుచు లోకిరెడ్డి శ్రీదేవితో కలిసి సోమవారం ఆమె పొలం వద్దకు వెళ్లారు. పొలం దున్నే విషయమై వారిని ప్రశ్నించగా ప్రసాద్‌తోపాటు, తిరుపాలమ్మ, వెంకటేశ్వర్లు, తిరుపాలునాయుడులు కలిసి దాడికి పాల్పడ్డారు. వారినుంచి శ్రీదేవి తప్పించుకోగా బుజ్జమ్మకు తలపై గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని శ్రీదేవి, మరి కొందరు చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలికి తరలించారు. ఘటన తర్వాత బాధితులు కావలి వెళ్లారని, ఈ విషయమై విచారణ చేపడతామని ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

నెల్లూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లారీని వెనుకకు నడుపుతున్న క్రమంలో ఓ యువకుడిని ఢీకొనడంతో అతను తీవ్రగాయాలపాలై మరణించినట్లు నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు సోమవారం తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు... టీపీగూడూరు మండలం సౌత్ ఆములూరు గ్రామానికి చెందిన ఓబిలి వేణు (27) ఆదివారం రూరల్లోని చిన్నచెరుకూరు రోడ్డు వద్దనున్న కాటన్ ఫ్యాక్టరీ ఎదుట ఉండే గోదాముల వద్ద నిలబడి ఉన్నాడు. అదే సమయంలో అక్కడున్న లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వెనుకకు నడపడంతో వేణును లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ వేణును స్థానికులు నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ్నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ఈ మేరకు వేణు బంధువు ఓబిలి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శివాలయంలో చోరీ యత్నం

కలువాయి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలో ఆదివారం రాత్రి చోరీ యత్నం జరిగింది. ఆలయం తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లిన దుండగులు అక్కడ ఉన్న సీసీ కెమెరాలను, విద్యుత్ బోర్డులను కూడా ధ్వంసం చేశారు. బీరువా తెరిచి అంతా గాలించారు. అయితే విలువైన వస్తువులు ఏమీ ఆలయంలో ఉంచలేదని పూజారి నరసింహరావు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లిన అయ్యప్ప భక్తులు ఈ విషయం గురించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలాన్ని పరిశీ లించారు. ఆలయాల్లో చోరీలు చేసే ముఠా మండలంలో సంచరిస్తున్నట్లు గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్రాంచైజ్ పేరుతో రూ. కోట్లకు మోసం

- వందలాదిమంది బాధితులు
- న్యాయం చేయండి: గిరిధర్‌రెడ్డి


సీఐ వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న బాధితులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ హోం ఫుడ్స్ ఫ్రాంచైజ్ ఇస్తామని నమ్మించి రెండు తెలుగు రాష్ట్రాల్లోని వందల మంది నుంచి రూ.కోట్లు కట్టించుకుని మోసం చేశారని, బాధితులకు న్యాయం చేయాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి దర్గామిట్ట పోలీసులను కోరారు. గ్రామీణ హోం ఫుడ్స్ ఫ్రాంచైజ్ తీసుకున్న పలువురు మోసం పోయామని గుర్తించి సోమవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కార్యాలయానికి వచ్చారు. వారి బాధలు విన్న ఎమ్మెల్యే వెంటనే బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ, డీఎస్పీ, దర్గామిట్ట పోలీసులతో ఫోన్లో మాట్లాడారు. అనం తరం బాధితులతో కలిసి గిరిధర్‌రెడ్డి దర్గామిట్ట పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ఫ్రాంచైజ్ పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.3.50 లక్షలకుపైగా వసూలు చేశారని, ఇలా తెలుగు రాష్ట్రాల్లో వందల మందిని నగదు తీసుకున్నారని, నాలుగు నెలలైనా సరుకు ఇవ్వకపోగా, సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నారని తెలిపారు. దీంతో బాధితులు ఎమ్మెల్యే రూరల్ కార్యాలయానికి వచ్చారని, వారందరికీ న్యాయం చేయాలని సీఐని కోరారు. కాగా, పోలీసులు ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదు.

దిత్వా.. దిగులు

(5వ పేజీ తరువాయి)

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. విద్యాసంస్థలకు మంగళవారం కూడా సెలవు ప్రకటించారు. సోమశిల జలాశయానికి 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నెల్లూరు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితి ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. అత్యవసర లైన్ డిపార్ట్‌మెంట్ల సిబ్బందికి సెలవులు రద్దు చేసి విధుల్లో కొనసాగిస్తున్నారు. బీచ్‌ల వద్దకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి నెల్లూరులో ఉండి నివారణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

- **నెల్లూరుకు దక్షిణ ఆగ్నేయంగా..**

నెల్లూరుకు దక్షిణ ఆగ్నేయంగా తీవ్ర వాయుగుండం కేంద్రీకృతమై ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో మంగళ, బుధవారాలలోనూ తేలికపాటి నుంచి భారీ వర్షాలతోపాటు 35 నుంచి 45 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.


మనుబోలులో నీటమునిగిన పంట పొలాలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	268

కోడిగుడ్ల ధర (100): 665



మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీట మునిగి చెరువులా మారిన నగరంలోని ఆర్టీసీ కాలనీ

రోజంతా వాన

- లోతట్టు జలమయం
- రోడ్లపై నీటి మడుగులు
- నగర వాసులకు తప్పని తిప్పలు



నెల్లూరు(సిటీ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : దిత్వా తుపాను ప్రభావంతో నెల్లూరు నగరంలో సోమవారం రోజంతా వాన కురిసింది. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నగరంలో ప్రధాన రహదారులు, రోడ్లు, కూడళ్లు, నివాసాల వద్దనూ వర్షపు నీరు చేరింది. నాలుగు చక్రాల వాహనాలు తప్ప ద్విచక్ర వాహనాలు నగరంలో ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఉద్యోగులు, చిరువ్యాపారులు, రోడ్డుమార్జిన వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

నగర వ్యాప్తంగా సోమవారం సాయంత్రం 5 గంటల సమయానికి 46.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. రూరల్లో 25.8 మి.మీ. వర్షం కురిసింది. నగరంలోని తల్పగిరికాలనీ, పడారుపల్లి, జనశక్తి నగర్, కొత్తూరు, మనుమసిద్ధి నగర్, పొగతోట, హరనాథపు రం, రామ్మూర్తినగర్, అరవింద్ నగర్, ఆదిత్య నగర్, శెట్టిగుంటరోడ్డు, సంతపేట, రంగనాయుకు లపేట ప్రాంతాలలో వర్షపు నీరు రోడ్లపై నిలిచింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులను కమిషనర్ నందన్ పరిశీలించారు. కాగా, నగరంలో ఎక్కడైనా వర్షాలకు ఇబ్బందులు ఎదురైతే తమ కార్యాలయంలోని 861-2356777- 0861-2316777 నెంబర్లకు సమాచారం అందచేయాలని కమిషనర్ నగర వాసులను కోరారు. ఇక, రూరల్లోని పొట్టేపాళెం, ములుముడి కలుజుల వద్ద నీటి ప్రవాహం కొనసాగుతోందని, మిగిలిన ప్రాంతల్లో ఇబ్బందికర పరిస్థితులు లేవని తహసీల్దారు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గ్రామాలలో ఇబ్బందులు ఏర్పడితే 9441592127కు సమాచారం ఇవ్వాలని కోరారు. కాగా, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని గోమతినగర్, కొండాయపాళెం, బుజబుజ నెల్లూరు, మినీబైపాస్‌రోడ్డు ప్రాంతాలలో వర్షాలకు నీటమునిగిన ప్రదేశాలను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లేందుకు తగు ఏర్పాట్లు చేయాలని కార్పొరేషన్ అధికారులకు సూచించారు. అవసరమైన చోట్ల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని చెప్పారు.





ఎంజీ మాల్ ఎదుట ప్రధాన రహదారిపై గుంతలు





ట్రంకు రోడ్డులో డ్రైన్‌ను పరిశీలిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ నందన్

చినుకుపడితే ఉండలేం !

కాస్త వర్షానికే ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో నగరంలోని ఇరగాళమ్మ సంఘం వద్ద ప్రజలు ఉండలేని దుస్థితి ఏర్పడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ ప్రాంతంలోని ఇళ్ల వద్దకు నీరు చేరింది. అధికారులు తమ గోడు వినాలని, పునరావాస కేంద్రాలకు తరలించాలని స్థానికులకు కోరుతున్నారు.

ఓటు కోసం కాదు... ఇచ్చిన మాట కోసం !

- సామాజిక పింఛన్ల పంపిణీలో మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఓటు కోసం కాదు.... ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ నెల ఒకటో తేదీన పింఛన్ నగదు తీసుకుని మీ ఇంటికి వస్తున్నాము అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నెల ఒకటో తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 68 లక్షల మంది పింఛన్‌దారులకు రూ. 34 వేల కోట్లు పంపిణీ చేస్తోందని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవన్నీ దాదాపుగా అమలు చేస్తున్నామన్నారు. నుడా ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ జోరువానను సైతం లెక్కచేయకుండా మంత్రి అధికారులను తీసుకుని లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి నగదు అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నందన్, నాయకులు నాగేంద్ర, నారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నెల్లూరు (వైద్యం) : ఎంతోమంది పేదలకు సీఎం సహాయనిధి ఓ సంజీవని వంటిదని మంత్రి నారాయణ అన్నారు. సోమవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో రూ.41,52,181లకు సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఎంతో మంది పేదలకు ఈ సహాయ నిధితో ద్పాటునందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యా సంస్థల జీఎం వీ. విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ టీ.అనూరాధ, పార్టీ నగర అధ్యక్షుడు ఎం. మధు పాల్గొన్నారు.



మహిళకు పింఛన్ నగదు అందచేస్తున్న మంత్రి నారాయణ, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి, తదితరులు

అర్హులందరికీ పింఛన్లు : రూరల్ ఎమ్మెల్యే



జోరువానలోనూ పింఛన్ నగదు అందచేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : అన్నీ అర్హతలున్న ప్రతీ ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్ అంది తీరుతుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతీ నెల ఒకటో తేదీనే సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తోందని చెప్పారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని కేశవులనగర్‌లో ఆయన ఇంటింటికి వెళ్లి పింఛను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు స్వయంగా పింఛన్ నగదును లబ్ధిదారుల ఇంటికి తీసుకెళ్లి అందచేస్తున్న రాష్ట్రం దేశంలోనే ఏపీ ఒక్కటేనన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు శంకుస్థాపన

రూరల్లోని ఆమంచర్ల పంచాయతీ మన్నవరప్పాడు, గోటూరువారికండ్రిక గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు సోమవారం టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. జిగ్నా కంపెనీ కేటాయించిన రూ. 30 లక్షల నిధులతో సాగునీటిని ఎత్తిపోయడం ద్వారా ఆ రెండు గ్రామాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. పీ4 కార్యక్రమంలో భాగంగా ఈ పనులు జరగడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమానికి ముందు నగరంలోని 26వ డివిజన్ డ్రైవర్స్ కాలనీ బిట్-2లో ఆయన సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో నాయకులు మలినేని వేణునాయుడు, అల్లాభక్షు, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో గీతా జయంతి



ఇస్కాన్ మందిరంలో భగవద్గీత పారాయణ చేస్తున్న ఇస్కాన్ భక్తులు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా కృష్ణమందిరాలు, వైష్ణవ ఆలయాల్లో గీతా జయంతి వేడుకలు సోమవారం జరిగాయి. భక్తిశ్రద్ధలతో సామూహికంగా భగవద్గీత పారాయ ణం చేశారు. నగరంలోని ఇస్కాన్ మందిరంలో ఉదయం అభిషేకాలు జరిగాయి. మందిరం ఛైర్మన్ డాక్టర్ శుకదేవ స్వామి గీతా జయంతి విశిష్టత ను వివరించారు. అనంతరం భక్తులతో కలిసి భగవద్గీత 18 అధ్యాయాలు 700శ్లోకాలు పారాయణ చేశారు. ఈ సందర్భంగా ఇస్కాన్ క్యాలెండర్ ఆవిష్కరించారు. బయ్యా శ్రీనివాసులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

- కృష్ణయోగ మందిరంలో..



గీతా వైభవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నజీర్ బాషా

నగరంలో సుజాతమ్మకాలనీ, అష్టలక్ష్మీ ఆలయంలోని కృష్ణయోగ మందిరంలో, గీతా వైభవ ట్రస్ట్ ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలు జరిగాయి. వివిధ పాఠశాలల విద్యార్థులు, గురువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గీతా వైభవ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, గీతా ప్రబోధక్ షేక్ నజీర్‌బాషా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత భగవద్గీతకు, శ్రీకృష్ణ భగవానునికి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు, గురువులు 40 శ్లోకాలను సామూహికంగా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి గీతా వైభవ ట్రస్ట్ ప్రశంసాపత్రాలు అందజేశారు. పలువురిని సత్కరించారు.

ఘనంగా అయ్యప్ప మండల పూజ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అయ్యప్పగుడిలో మండల పూజలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం పాలాభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలశపూజ, నవకాభిషేకం, ఉచ్చపూజ భగవతి సేవ, అత్తాళపూజ, శ్రీవేలి ఉత్సవం, పడి కర్పూర దీపం జరిగాయి.

మాగుంట సుబ్బరామిరెడ్డికి ఘన నివాళి



మాగుంట సుబ్బరామిరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి 30వ వర్ధంతిని సోమవారం నగరంలోని ఎస్-2 థియేటర్స్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆశాజ్యోతి సుబ్బరామిరెడ్డి అన్నారు. ఆయన ఎంపీగా ఉన్నప్పుడు ఉదయగిరి, ఆత్మకూరు తదితర ప్రాంతాలను ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నాయకులు స్వర్ణ వెంకయ్య, బాల సుధాకర్, ఏసు నాయుడు, రఘురాం ముదిరాజ్, మాగుంట మమతమ్మ, సుబ్బరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా భరత్

నెల్లూరు(విద్య), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నెల్లూరు విభాగ్ సంఘటన కార్యదర్శి భరత్‌కుమార్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎంపికయ్యారు. డెహ్రాడూన్‌లో జరిగిన 71వ జాతీయ మహాసభలో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రఘురాజ్ కిషోర్ తివారీ ప్రకటించిన కమిటీలో భరత్‌కు చోటు దక్కింది. తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పనిచేసిన అనుభవంతో తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా భరత్ తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఇద్దరి నేత్రదానం



మహేష్ (ఫైల్) వెంకటేష్ (ఫైల్)

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని లేక్‌వ్యూ కాలనీకి చెందిన రాచగొల్ల మహేష్ ఆదివారం ప్రభుత్వ వైద్య కళాశాలలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఆయన నేత్రాలను తండ్రి నాగేంద్రప్రసాద్ దానం చేశారు. అలాగే రోశయ్యనగర్‌కు చెందిన పల్లాల వెంకటేష్(26) ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సోమవారం మృతిచెందారు. అతని నేత్రాలను తల్లి అరుణ దానం చేశారు. వీరిద్దరి నేత్రాలను ప్రభుత్వ ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించారు.

స్మారక చిహ్నాల సంరక్షణ చర్యలేమిటి?

- లోక్‌సభలో వేమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నాల సంరక్షణకు చేపడుతున్న చర్యలేమిటని సోమవారం లోక్‌సభలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర సాంస్కృతిక పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సమాధానమిస్తూ దేశ వ్యాప్తంగా 3685 పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అవశేషాలను భారత పురావస్తు సర్వే గుర్తించి పర్యవేక్షిస్తోందని వివరించారు. వాటిలో 135 ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని తెలిపారు.

మురుగునీటి పునర్వినియోగం మాటేమిటి? : బీద

రాష్ట్రంలో మురుగునీటి పునర్వినియోగం-పట్టణ జలవనరుల అభివృద్ధికి ఏమి చర్యలు తీసుకుంటున్నారని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు సోమవారం రాజ్యసభలో ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి టోఖన్ సాహు సమాధానం ఇస్తూ నీటి సరఫరా, పారిశుధ్యం అంశాలు రాష్ట్రాల అధీనంలోనివని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమృత్, అమృత్ 2.0 వంటి పథకాల ద్వారా రాష్ట్రాలకు ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తు న్నట్లు తెలిపారు.

జాతీయ నెట్‌బాల్ పోటీలకు జడ్పీ స్కూలు విద్యార్థులు



మెహరీన్ గౌతమ్ ఢిల్లీబాబు

నెల్లూరు(విద్య), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):మహారాష్ట్రలోని నాందేడ్‌లో జనవరిలో జరగనున్న జాతీయ నెట్‌బాల్ పోటీలకు నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ స్కూలు ప్రధానోపాధ్యాయుడు పీవీ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన రామాయణం గౌతమ్ కుమార్ ఇటీవల విజయవాడలో జరిగిన అండర్-17 రాష్ట్ర పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ పోటీలకు రాష్ట్రం నుంచి ఎంపికయ్యాడన్నారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన అండర్-14 రాష్ట్ర పోటీల్లో వీ ఢిల్లీబాబు, మెహరీన్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. జాతీయ పోటీల్లో కూడా వారు రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు అరిగెల విజయ్‌కుమార్, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

'గీతాంజలి'లో దేవగుడి చిత్ర బృందం సందడి



కళాశాలలో దేవగుడి చిత్ర యూనిట్

నెల్లూరు(విద్య), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం దేవగుడి చిత్ర బృందం సందడి చేసింది. ఆ సినిమా నిర్మాత, దర్శకుడు బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆశీర్వదించేలా సినిమా నిర్మాణం చేపట్టామని, హీరో అభినవ్ శౌర్య చేసిన సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. సినిమాను ఈనెల 19న విడుదల చేస్తామని, నెల్లూరులో రెండు రోజుల ముందుగానే ప్రివ్యూ షో వేస్తున్నామని ప్రకటించారు. అనంతరం ఈ సినిమాలోని పాటలను గాయకులు పాడగా నటీనటులు డ్యాన్స్‌లు వేసి అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎన్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్ గుండ్లపల్లి సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ కలికి శ్రవణ్‌కుమార్, డీన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'మాదక ద్రవ్యాలకు నిలయంగా నెల్లూరు'

నెల్లూరు(వెంకటేశ్వరపురం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నెల్లూరు నగరం మాదకద్రవ్యాలకు నిలయంగా మారిందని వైసీపీ ఎమ్మెల్సీ చం ద్రశేఖర్‌రెడ్డి ఆరోపించారు. ఆయన సోమ వారం వైసీపీ న గర కార్యాలయంలో పార్టీ నా యకులతో కలసి సేవ్ ది నెల్లూరు ప్లకార్డుల ను ప్రదర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రశాంతత, నిజాయితీకి ప్రతీక అయిన నెల్లూరు సిటీ, ఇప్పుడు డ్రగ్స్, గంజాయికి చిరునామాగా మారిం దని విమర్శించారు. పోలీసు వ్యవస్థ నిర్వీర్యం అయిందన్నారు.

కొనసాగుతున్న హనుమాన్ చాలీసా పారాయణం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో 48 గంటల నిరంతర హనుమాన్ చాలీసా పారాయణం కొనసాగుతోంది. విజయవాడకు చెందిన అఖిల భారత హనుమాన్ పీఠం కళాకారులు ఈ పారాయణం చేస్తున్నారు. ఈ కార్యక్రమం మంగళవారం సాయంత్రంతో ముగుస్తుంది. కాగా, శబరి శ్రీరామక్షేత్రంలో బుధవారం హనుమద్వ్రతం ని ర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉద యం 8 గంటలకు అభిషేకం, 9 గంటలకు హోమం, 10గంటలకు లక్ష నాగవల్లీ దళార్చన, 11గంటలకు పూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 3గంటలకు శ్రీరామ స్తూపంలో శ్రీరామకోటి గ్రంథాల నిక్షిప్త వేడుకలు జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

'డాక్టర్ బైరి నరేష్ అరెస్ట్ అక్రమం'

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కుల నిర్మూలన సంస్థను స్థాపించి ప్రజలను చైతన్యపరుస్తున్న డాక్టర్ బైరి నరేష్‌ను గద్వాల్ జిల్లాలో అక్రమంగా అరెస్టు చేశారని మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దమ్ము పద్మశ్రీ నాస్తిక్ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ నరేష్‌ను కలవడానికి వచ్చిన వారిని కలవనీయడం లేదని, ఒక పెళ్లికి హాజరయ్యేందుకు వచ్చిన ఆయన్ని అరెస్ట్ చేయటం దుర్మార్గమని ఆరోపించారు.

నగరంలో రౌడీ షీటర్లతో ర్యాలీ

నెల్లూరు(క్రైం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గతంలో ఎప్పుడూ లేని విధంగా సినీ ఫక్కీలో నెల్లూరు నగర రోడ్లపై రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లు, ఇతర నేర చరిత్ర కలిగిన వారితో సోమవారం పోలీసులు ర్యాలీ నిర్వహించారు. నగరంలోని వీఆర్సీ కూడలి నుంచి గాంధీబొమ్మ వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం వారితో భవిష్యత్తులో ఎలాంటి నేర కార్యకలాపాల్లో పాల్గొనబోమని, సత్ప్రవర్తన కలిగి ఉంటామని ప్రమాణం చేయించారు. నగర ఇన్‌చార్జి డీఎస్పీ గిరిధర్ మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిన్నబజారు, వేదాయపాలెం, బాలాజీనగర్ పోలీసు స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీబొమ్మ వద్ద రౌడీషీటర్ల ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

నీలి నీలి ఆకాశం.. ఎరుపెక్కిన వేళ !

పగలంతా నీలం రంగు.. సాయంత్రం నారింజ రంగులో ఉండే ఆకాశం సోమవారం సాయం సంధ్యవేళ ఎరుపు రంగులో దర్శనం ఇచ్చింది. ఇది నగర వాసులను ఎంత గానో ఆకట్టుకుంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి, నెల్లూరు)



ఫిర్యాదుదారులతో గౌరవంగా నడుచుకోండి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారులతో గౌరవప్రదంగా నడుచుకోవాలని జిల్లా పోలీసు అధికారులను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. ఆయన సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో శాంతిభద్రతలపై ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ఉన్న పరిస్థితులు, నేర ప్రాంతాలపై ఆరా తీశారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లు, పాత నేరస్తుల వివరాలు సేకరించారు. రికార్డులు తనిఖీ చేశారు. నేరస్తులపై నిఘా పెంచాలని, క్రిమినల్ చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేయాలని, పెండింగ్ కేసుల విచారణలో జాప్యం లేకుండా ఫైనల్ రిపోర్ట్స్ చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో నగర ఇన్‌చార్జి డీఎస్పీ గిరిధర్, చిన్నబజారు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

పెంచలయ్య హత్యకు నిరసనగా నేడు జిల్లా బంద్

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజానాట్య మండలి నాయకుడు పెంచలయ్య హత్యకు నిరసనగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా బంద్ నిర్వహిస్తున్నట్లు ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, సీపీఐ నెల్లూరు నగర సహాయక కార్యదర్శి సయ్యద్ సిరాజ్ వెల్లడించారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్ వల్ల యువత చెడిపోతోందని, నెల్లూరును డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని పెంచలయ్య ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. గంజాయి మీద పోలీసులు ఉక్కుపాదం మోపుతున్న తరుణంలో గంజాయి బ్యాచ్ కక్షకట్టి పెంచలయ్యను కిరాతకంగా హత్య చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గంజాయి ముఠాను పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి అహ్మద్, జమాత్ ఇస్లాం నాయకుడు నవీద్, షాజహాన్, లతీఫ్, మున్వర్, షాహుల్, గని, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అజీజ్ అహ్మద్

● ఆర్పీఐ మద్దతు

నెల్లూరు(హరనాథపురం) : గంజాయి గ్యాంగ్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలు మంగళవారం చేపడుతున్న బంద్‌కు మద్దతు ఇస్తున్నామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) జిల్లా అధ్యక్షుడు షేక్ మాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గంజాయి సరఫరా చేసే వ్యక్తులు ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో, ఆ పార్టీ ప్రతినిధులను కూడా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రసన్నుడి ఆలయానికి రూ.21 లక్షల ఆదాయం

బిట్రగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరిలో జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వివిధ అంశాలకు సంబంధించి సోమవారం నిర్వహించిన వేలం పాటల్లో ఆలయానికి రూ.21 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రాధాకృష్ణ తెలిపారు. ఈ వేలపాటలు ఆలయాల కోవూరు గ్రూప్ ఈవో కృష్ణప్రసాద్ అధ్యక్షతన జరిగాయి. బ్రహ్మోత్సవాల సమయంలో, ఏడాది పొడవున దుణానాల నిర్వాహణకు, చెరుకు విక్రయానికి స్థల కేటాయింపు, ఏడాది పొడవు తలనీలాలు పోగు చేసుకోవడం, కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయించుకోవడం, పాదరక్షలు భద్రపరిచే హక్కు వేలం జరిగింది. మిగిలిన వేలం పాటలు వాయిదా వేశారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తెలియ చేస్తామని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారులు, దుకాణదారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవ వేలం పాటలు నిర్వహిస్తున్న ఈవో రాధాకృష్ణ

కమ్మేస్తున్న కాలుష్యం

- పరిశ్రమల వల్ల పెరుగుతున్న వైనం
- వాయుకాలుష్యం వల్ల సేఫ్
- రసాయనాల పట్ల అప్రమత్తత అవసరం
- నిబంధనలు పాటించాలంటున్న అధికారులు
- నేడు జాతీయ కాలుష్య నివారణ దినం

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తీర ప్రాంతంలో కాలుష్యం అధికంగా ఉంది. దీంతో ఆయా ప్రాంతాల్లో మనుషులతోపాటు జీవాలు కూడా కాలుష్యం బారిన పడుతున్నాయి. ఆయా పరిశ్రమలు పూర్తిస్థాయిలో నియంత్రణ చర్యలు చేపట్టక పోవటంతో తీరప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల కాలుష్యం ప్రబలుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం డిసెంబరు 2న (నేడు) జాతీయ కాలుష్య నివారణ దినం జరుపుకోవాలని తీర్మానించింది.

● సేఫ్‌గా జిల్లా

నెల్లూరు జిల్లా వాయుకాలుష్యంలో నిబంధనల ప్రకారం క్యూబిక్ మీటరు 52 మైక్రో గ్రాములు ఉండటంతో ఇది ఎంతో సేఫ్‌గా ఉన్నట్లు గుర్తింపు వచ్చింది. జిల్లాలోని తీర ప్రాంతాల్లో పరిశ్రమలు పెద్దసంఖ్యలో రావటంతో వాటి కారణంగా కాలుష్యం 15 కిలోమీటర్ల వరకు విస్తరించింది. కొన్ని పరిశ్రమలు కాలుష్య నియంత్రణశాఖ అధికారుల చర్యల వల్ల కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకోవటంతో కొంత వరకు కాలుష్యం అదుపులో ఉంది. కొన్ని పరిశ్రమల కారణంగా నీరు, గాలి, భూమి కలుషితం కావడంతో ప్రజారోగ్యం దెబ్బతినడానికి కారణలవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో భూమి, నీరు, గాలి కాలుష్యానికి గురవుతూ కొన్ని ప్రాణాలకే ముప్పుగా మారుతున్నాయి.

జిల్లాలో వాయు కాలుష్యం

సంవత్సరం	మైక్రోగ్రాములు
2020-21	59
2021-22	60
2022-23	54
2023-24	52
2024-25	52
2025-26	52



ముత్తుకూరు మండలంలోని థర్మల్ స్టేషన్ వెదజల్లుతున్న కాలుష్యం

● తగ్గిన పంటల దిగుబడి

జిల్లాలోని తీరప్రాంతాల్లో ఇప్పటికే కొన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించాయి. ఆ పరిశ్రమల 15 కిలోమీటర్ల పరిధిలో 2 నుంచి 5 డిగ్రీలు ఉష్ణోగ్రత పెరిగి పంటల దిగుబడి 30 శాతం తగ్గుతుంది. ఆక్వా పరిశ్రమమే కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఒక్కో థర్మల్ పవర్ స్టేషన్ నుంచి రోజుకు 2 లక్షల టన్నుల బూడిద వెదజల్లబడి తాగునీరు, సాగునీరు కలుషితమవుతున్నది. థర్మల్ కేంద్రాల వేడి వల్ల సముద్రంలోని వేల టన్నుల రొయ్యలు, చేపలు చనిపోయి, మత్స్యకారులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ఇక వాహన కాలుష్యం వల్ల జీవజాతుల మనుగడ కష్టతరంగా మారుతోంది. గతంలో ఏడాది 46 డిగ్రీలకే అల్లాడిపోయిన జిల్లా ప్రజానీకం వచ్చే వేసవిలో 47 డిగ్రీల ఉష్ణోగ్రతల వరకు చవిచూడాల్సిన వస్తుందని నిపుణులు అంటున్నారు. దీనికితోడు ఫ్రిజ్‌లు, ఏసీల వాడకం పెరగడంతో క్లోరోఫ్లోరో కార్బన్‌లు వెదజల్లుతున్నాయి. ఓజోన్ పొరను దెబ్బతీస్తున్నాయి. ఐదేళ్లగా కాలుష్యం ప్రమాదస్థాయిలో లేదని అధికారులు చెబుతున్నా, కాలుష్యం ప్రమాద స్థాయిలోనే ఉందన్న వాదన వినిపిస్తోంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం...



జిల్లాలో కాలుష్య నియంత్రణపై ప్రజల్లో అవగాహన కలిగిస్తున్నాం. ప్రత్యేకించి జిల్లా తీర ప్రాంతంలో ఉన్న పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. కాలుష్య నియంత్రణ చర్యలు పక్కాగా పాటిస్తుండటంతో కాలుష్యం నియంత్రణలో ఉంది. త ప్పనిసరిగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి. త ద్వారా ఆక్సిజన్ ఉత్పత్తి పెరిగి, ప్రతీ జీవి ఆరోగ్యంగా ఉంటుంది

- అశోక్ కుమార్, కాలుష్య నియంత్రణ శాఖ ఈఈ

రేపు హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

నెల్లూరు(విద్య), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3న చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జిల్లా పురుషుల జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు కనుమూరు హరిచంద్రా రెడ్డి, పీ అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ, మూడు ఫొటోలు తీసుకురావాలని కోరారు. ఎంపికైన జట్టు ఈనెల 5, 6 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు.

'డయల్ యువర్ సీఎండీ'కి ఎనిమిది వినతులు

నెల్లూరు,(జడ్పీ), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి: ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ తిరుపతిలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి జిల్లా నుంచి వినియోగదారులు సమస్యలు తెలుపుతున్నారు. ఇందులో భాగంగా సోమవారం 8 సమస్యలను జిల్లాలోని వినియోగదారులు సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ స్తంభాలు, లైన్లు, ఓల్టేజీ తదితర సమస్యలపై సీఎండీకి తెలపటంతో ఆ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పరీక్ష ఫీజు పేరుతో దోపిడీ

- టెన్త్ ఎగ్జామ్ ఫీజు రూ.125
- ప్రైవేట్ పాఠశాలల్లో రూ.వెయ్యికి పైగానే వసూలు

పొదలకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల ఫీజు పేరుతో అడ్డగోలు దోపిడీ జరుగుతోంది. పలుచోట్ల ప్రైవేటు పాఠశాలల్లో పదిరెట్లు బాదేస్తున్నారు. జిల్లాలో చాలా పాఠశాలల్లో ఈ పరిస్థితి నెలకొనగా, పట్టించుకోవాల్సిన విద్యాశాఖ ప్రేక్షక పాత్రకే పరిమితమైంది. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. వచ్చే మార్చిలో పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ విడుదలైంది. రెగ్యులర్ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.125గా నిర్ణయించారు. అదే సప్లిమెంటరీ రాసేవారికి మూడు సబ్జెక్టుల లోపు ఉంటే రూ.110గా పేర్కొన్నారు. ఈనెల 6 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా, ఆ గడువు దాటితే అపరాధ రుసుము చెల్లించాలి. ఇక్కడే అసలు కథ మొదలైంది.

● ఇష్టానుసారం వసూలు

ప్రభుత్వం నిర్ణయించిన పరీక్ష రుసుము రూ.125 బదులు జిల్లాలోని అనేక ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. కొందరు తాము డీఈవో కార్యాలయంలో సిబ్బందికి ఇవ్వాల్సి ఉంటుందని చెబుతుండగా, మరి కొందరు పరీక్షల వేళ మెయింటెనెన్స్ కోసం నిధులు సేకరిస్తున్నట్లు చెబుతున్నారు. ఇంకొందరైతే ఏకంగా మీ పిల్లలకు అనువైన పరీక్ష కేంద్రాన్ని కేటాయించేందుకు ఈ సొమ్ముతో ప్రయత్నం చేస్తామంటూ చెబుతున్నారు. ప్రభుత్వం గతానికి భిన్నంగా పారదర్శకంగా ఫీజు చెల్లించేందుకు ఈసారి నేరుగా హెచ్ఎంలకు అవకాశం కల్పించింది. అయితే కొన్ని పాఠశాలల్లో మాత్రం పాత ఆనవాయితీ కొనసాగిస్తూ నగదు వసూళ్లకు దిగుతున్నారు. జిల్లాలో పరీక్ష ఫీజు పేరుతో రూ.2వేల నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తుండడం గమనార్హం. ఇక్కడ కనీస ఫీజు రూ.వెయ్యికి తక్కువ ఉండడం లేదు. దీనిపై గట్టిగా మాట్లాడితే పరీక్షల వేళ పిల్లలను ఇబ్బంది పెడతారేమోననే భయంతో విద్యార్థుల తల్లిదండ్రులు మౌనం వహిస్తున్నారు. నిర్ణీత రుసుము కంటే ఎక్కువ వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ కమిషనర్, డీఈవో ఇప్పటికే సమావేశాల్లో హెచ్చరించారు. ఉల్లంఘించే ప్రైవేటు పాఠశాలలపై జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. అయినా క్షేత్రస్థాయిలో ఇందుకు భిన్నంగా ఉంది.



సమష్టిగా హెచ్‌ఐవీని నిర్మూలించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ఏడీఎంహెచ్‌వో ఖాదర్‌వలి ● ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలు, ప్రశంశా పత్రాలు

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో హెచ్ఐవీ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి అవసరమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, హెచ్ఐవీ నివారణ అధికారి, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి వెల్లడించారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా నెల్లూరులో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఇది గాంధీబొమ్మ నుంచి పురమందిరం వరకు సాగింది. అనంతరం టౌన్‌హాల్లో నిర్వహించిన సదస్సులో అధికారులు ఉపన్యసించారు. అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టటం ద్వారా హెచ్ఐవీపై ప్రజల్లో చైతన్యం తీసుకురావచ్చన్నారు. జిల్లాలో హెచ్ఐవీ తీవ్రత బాగా తగ్గిందన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనూ హెచ్ఐవీకి సంబంధించి ఐసీటీసీ సెంటర్లు ఉన్నాయని, వాటిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారని, మందులు కూడా ఇస్తారని తెలిపారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ హెచ్ఐవీ విషయంలో యువత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ నివారణలో ప్రతిభ చూపిన వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలకు ప్రతిభా పురస్కారాలు, జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ, ఎన్ఎస్‌పీ, పీఎంపీ సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.





పాల్గొన్న అధికారులు, మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

ఆపదలో ఆప్తమిత్రుడిలా ఎస్‌వోఎస్ బాక్సు

ఉదయగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద 167-బీజీ జాతీయ రహదారి పక్కనే ఎస్‌వోఎస్ బాక్సును నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థ ఏర్పాటు చేసింది. 565, 167-బీజీ, 167-బీతోపాటు జిల్లాలో విస్తరించిన జాతీయ రహదారుల వెంట ఈ బాక్సులు ఏర్పాటు చేశారు. వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు, బ్రేక్‌డౌన్, ఆయిల్ అయిపోయినప్పుడు ఈ ఎస్‌వోఎస్ బాక్సులను వినియోగించుకునే అవకాశముంది. వీటిని అత్యవసర సమయాల్లో వినియోగించుకునేలా బటన్, మైక్, స్పీకర్, జీపీఎస్ అమర్చి ఉంటాయి. వీటి పనితీరు ఫోన్ కన్నా వేగంగా ఉంటుంది. బటన్ నొక్కిన వెంటనే టోల్‌ప్లాజా కంట్రోల్ రూంకు సమాచారం అందుతుంది. ఘటనకు సంబంధించి వివరాలు పోలీస్, హైవే పెట్రోలింగ్ వాహనాలు, హైవే అంబులెన్స్, అగ్నిమాపక శాఖలకు వేగంగా అందుతాయి. అయితే వీటిపై ప్రజలకు సరైన అవగాహన లేదు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతోంది. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలి.



జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఎస్‌వోఎస్ బాక్సు

రేపు దివ్యాంగులకు పరికరాల అందజేత

కావలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంను పురస్కరించుకుని ఈనెల 3వ తేదీన వెంకటాచలం మండల కేంద్రంలోని సీఆర్సీ సెంటర్‌లో దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందచేస్తారని టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి సెంటర్లలో 2023లో ఎంపికైన దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, చేతి కర్రలు, చంక కర్రలు, చదువుకునే విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందచేస్తారని పేర్కొన్నారు. కనుక ఎంపికైన దివ్యాంగులు 3వ తేదీ ఉదయం 8గంటలకు వెంకటాచలంలోని సీఆర్సీ సెంటర్‌కు చేరుకుని వాటిని అందుకోవాలని పేర్కొన్నారు.



ఎంపికయిన అసోసియేషన్ కార్యవర్గం

ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా అధ్యక్షుడు రాజేష్

కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించేలా పాటు పడతానని నూతనంగా ఎంపికయిన జిల్లా ల్యాబ్ టెక్నీషియన్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు బీవీ. రాజేష్ అన్నారు. సోమవారం ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో కార్యవర్గ ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషయన్‌లు నేడు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వారి సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కిశోర్ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, రాష్ట్ర మహిళా వింగ్ సహాయ కార్యదర్శి సుభద్ర ఎన్నికల పరిశీలకులుగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఎన్నికలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా ఎస్‌డి రసూల్ సాహెబ్, కోశాధికారిగా మహ్మద్ షఫీ, కార్యనిర్వాహక కార్యదర్శిగా మీరామొహిద్దీన్, మహిళా సహాయక కార్యదర్శిగా శాంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ఏపీఎన్‌జీవో నగర అధ్యక్షుడు రామకృష్ణ, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి సునీల్‌కుమార్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సందానిబాషా పాల్గొన్నారు.

గంజాయి డాన్ కామాక్షి ఇల్లు ధ్వంసం

● స్థానికుల ఆగ్రహానికి నేలమట్టం

నెల్లూరురూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : గంజాయి ముఠాకు నాయకురాలుగా వ్యవహరిస్తూ, సీపీఎం నాయకుడు పెంచలయ్యను హత్య చేయించిన కల్లూరుపల్లికి చెందిన అరవ కామాక్షి ఇంటిని సోమవారం రాత్రి స్థానికులు నేలమట్టం చేశారు. ఆర్డీటీ కాలనీలో ప్రజానాయకుడిగా, చెడుఅలవాట్లపై నిత్యపోరాటం కొనసాగిస్తూ వచ్చిన పెంచలయ్యను హతమార్చిన ఘటనతో ఆగ్రహించిన స్థానికులు కామాక్షి, ఆమె కుటుంబీకులు, సన్నిహితులు, అణుచరులకు చెందిన ఇళ్లను నేలమట్టం చేశారు. కామాక్షితో పాటు ఆమె అనుచరులతో తాము ఎంతగానో ఇబ్బందులు పడుతున్నామని, యువతను పనికట్టుకుని చెడకొడుతున్నారని ఆరోపించిన వారంతా మహిళలకు రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కామాక్షి ముఠా ఇక తమ ప్రాంతానికి రాకూడదని పేర్కొన్నారు. ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది.

ప్రమాదాలకు నిలయంగా లో లెవల్ వంతెన

ఉదయగిరి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మా సాయిపేట గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిపై నిర్మించిన లోలెవల్ వంతెన ప్రమాదాలకు నిలయంగా మారింది. ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు చెందిన ఎంతో మంది నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరికి పలు రకాల పనులపై పరుగులు తీస్తుండడంతో ఆ రహదారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ఎలాంటి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. అప్పట్లో వంతెనకు ఇరువైపులా రక్షణగోడలు నిర్మించక పోవడంతో ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలకు గురికావల్సి వస్తుందని వాపోతున్నారు. అంతేగాక రహదారి కింది భాగం సైతం లోతుగా ఉండడంతో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కనీసం ఎలాంటి హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.



సిద్ధేశ్వరాలయాన్ని సందర్శించిన ఈవో

ఉదయగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయ ఆవరణలో ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమణారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం, ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం అర్చకులు ఎల్వీ ప్రసాద్‌శర్మకు తగు సూచనలు, సలహాలు అందజేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12368
వెండి కిలో ధర	రూ. 179200
వెండి ఒక గ్రాము	రూ. 184.20

ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలి


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఉదయగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్లపడియ పంచాయతీ పప్పులవారిపల్లి గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సోమవారం ఇన్‌చార్జి తహసీల్దారు షాజియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుమారు 40 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి ఆక్రమించేందుకు యత్నిస్తుండగా అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయితే ప్రస్తుతం ఆక్రమణదారులు ఆ భూముల్లో జామాయిల్ మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. దీంతో స్పందించిన తహసీల్దారు ప్రభుత్వ భూముల్లో జామాయిల్ నాటకుండా చర్యలు తీసుకుంటామని, ఆక్రమణదారులపై చర్యలు చేపడతామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

వీపీఆర్ నేత్ర శిబిరం ప్రారంభం


వృద్ధురాలికి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న చెంచలబాబు

ఉదయగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో వీపీఆర్ నేత్ర బస్సు శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొస్నెబోయిన చెంచలబాబుయాదవ్ నాయకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. 218 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి 121 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెంచలబాబుయాదవ్ మాట్లాడుతూ ఉదయగిరి మండలంలోని 17 పంచాయతీల్లో నిర్వహించే ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, గండిపాళెం జలాశయ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, వీపీఆర్ ఫౌండేషన్ ఆర్గనైజర్ శంకర్, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, రెడ్డిబత్తిన నరసింహారావు, సాయి, నల్లిపోగు రాజా, నరసింహులు, ఉప్పటూరి వెంకటయ్య, శివకృష్ణ, వీపీఆర్ ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గండిపాళెంలో ఉచిత వైద్యశిబిరం

ఉదయగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థులు మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్ గ్రామాల్లో జాతీయ సేవా పథకం కార్యక్రమాల్లో భాగంగా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో విద్యార్థులు మత్తు పదార్థాలు, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్లకార్డులు చేతపట్టి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, వైద్యులు మెర్సీ హీన, రుబీన, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చెంచలబాబుయాదవ్, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు సునీత, వెంకటేశ్వర్లు, జ డ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు, ఐటీడీపీ స భ్యులు నరసింహారావు, సాయి, శివకృష్ణ, అచార్యులు మాలిని, అశోక్ నాయక్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్ల నియామకం


నగదు చెక్కులను అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లి ప్రాథమిక పాఠశాలకు సోమవారం అదే గ్రామానికి చెందిన విఘ్నేశ్వర సేవా సమితి, కేకే జనని చారిటబుల్ ట్రస్టు సభ్యులు తమవంతు చేయూతగా విద్యా వలంటీర్లను నియమించారు. ఉపాధ్యాయుల కొరత ఉండడంతో ప్రధానోపాధ్యాయులు వడ్డే కేశవమూర్తి విషయాన్ని టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు పత్తి జాని దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సభ్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యా సంవత్సరం పూర్తయ్యేంత వరకు వలంటీర్లు విధులను నిర్వహిస్తారన్నారు. అనంతరం ట్రస్టు సభ్యులు వేతనాలకు సంబంధించిన రూ. 60వేల నగదు చెక్కులను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు వల్లపుశెట్టి సభాపతి, నూల మహేష్, మాధవ, రమేష్, రవి, మహేంద్ర, గురుప్రసాద్, అబ్దుల్‌రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆనం ఆత్మకూరు పర్యటన

ఆత్మకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం పర్యటించనున్నట్లు ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఆత్మకూరు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో నియోజకవర్గ పరిధిలో 28 మందికి రూ. 35.51 లక్షల సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులను పంపిణీ చేస్తారని తెలిపారు. ఈకార్యక్రమానికి అధికారులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కలిసిన భానుకిరణ్

సంగం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్‌ను నియోజకవర్గ సీనియర్ నాయకుడు దాడి భాను కిరణ్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేసే వారికి అధినేత పవన్‌కల్యాణ్ సముచిత స్థానం కల్పిస్తారని తెలిపారన్నారు.

గుండెపోటుతో విద్యుత్ జేఎల్ఎం మృతి

సీతారామపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారంరెడ్డిపల్లి సచివాలయ జూనియర్ విద్యుత్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న మహిమలూరి వెంకటేష్ (27) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు. లైన్‌మెన్ మృతితో పబ్బులేటిపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నత్త నడకన సచివాలయ భవనాల నిర్మాణం

● ఏళ్ల తరబడి సాగుతున్న పనులు


అసంపూర్తిగా నిలిచిన సచివాలయ భవనం చుట్టూ ఏపుగా పెరిగిన కంపచెట్లు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో ఆర్భాటంగా ప్రారంభమైన సచివాలయ భవనాల పనులు నత్త నడకన సాగుతున్నాయి. మండలంలోని తోటలచెరువు పల్లిలో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచి ఏళ్ల తరబడి వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఆ భవనానికి రూ. 40లక్షల నిధులు మంజూరవడంతో అప్పట్లో పార్టీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి పనులు చేపట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అసంపూర్తిగా నిలిచిన ఆ భవనం చుట్టూ ఏపుగా పెరిగిన కంపచెట్లు అడవిని తలపిస్తున్నప్పటికీ పట్టించుకొనే నాథులే కరువయ్యారు. దీం తో ఆ ప్రాంతం మందుబాబులకు, అ సాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందనే విమర్శలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా భవన నిర్మాణం పూర్తికాక గ్రామంలో ఇరుకైన అద్దె భవనంలో సచి వాలయాన్ని నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి సచివాలయ భవన నిర్మాణ పనులు ముందుకు సాగేలా చర్యలు చేపట్టి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నియోజకవర్గానికి పెద్దఎత్తున అభివృద్ధి పనుల మంజూరు

● రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

సంగం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నియోజకవర్గానికి పెద్దఎత్తున అభివృద్ధి పనులు మంజూరైనట్లు రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన సంగం మండలంలోని గాంధీ జన సంఘం గిరిజన కాలనీలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగం మండలంలోని గాంధీజన సంఘం గ్రామంలో రాష్ట్రీయ గ్రామస్వరాజ్ పథకం ద్వారా పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 32 లక్షలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా మరో రెండు గ్రామాల పంచాయతీ భవనాలకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. వీటిని త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రూ. 15 కోట్లతో ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు నిర్మించేలా నిధులు మంజూరు చేశామని, కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని మొదలు కానున్నట్లు చెప్పారు. గాంధీజనసంఘంలో రూ. 15 లక్షలు సీసీ రోడ్లకు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే మరో 7 గ్రామాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రూ. 27 కోట్లతో రహదారి నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంజూరు చేశారని, త్వరలోనే ఇందుకు సంబంధించి ఆదేశాలు అందున్నట్లు ఆయన తెలిపారు. సంగం మండలంలోని వీర్లగుడిపాడు గ్రామానికి రాకపోకలు కల్పించేందుకు బీరాపేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ. 25 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు మొదలు పెట్టి సంగం జాతీయ రహదారితో వీర్లగుడిపాడును అనుసంధానం చేస్తామన్నారు. నియోజకవర్గంలో రెండు సబ్‌స్టేషన్లు కూడా నూత నంగా మంజూరైనట్లు అందులో ఒకటి సంగం మండలంలోని అన్నారెడ్డి పాలెంలో ఏర్పాటు చేస్తా మని తెలిపారు. నియోజకవర్గంలో 77 చిన్న ఆలయా లకు రూ. 5లక్షల చొప్పున మొత్తం రూ. 3.85 కోట్లు మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయ న్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, ఆర్డీవో పావని, తహసీల్దారు సోమ్లానాయక్, ఎంపీడీవో షాలెట్, మండల పార్టీ అధ్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దిత్వా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో


సంగం: లోతట్టు కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీవో

సంగం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీవో పావని సూచించారు. మండలంలోని సిద్దీపురం గ్రామంలో లోతట్టు కాలనీల్లో ఆత్మకూరు ఆర్డీవో పావని సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె సిద్దీపురం దళితవాడ లోతట్టు కాలనీ ఇళ్లవద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. వర్షాలు ఎక్కువై ముంపునకు గురైతే వెంటనే అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. పునరాస కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట తహసీల్దారు సోమ్లా నాయక్, సాగునీటి సంఘం అధ్యక్షుడు సూరా శ్రీనివాసులురెడ్డి, వీఆర్వో తదితరులు ఉన్నారు.

నీట మునిగిన నారుమళ్లు

మండలంలోని తరుణవాయిలో దిత్వా తుపాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నారుమళ్లు నీట మునిగాయి. ఈనెల 15వ తేదీన డెల్టాలకు నీటిని విడుదల చేయడంతో తరుణవాయి రైతులు సుమారు 200 ఎకరాలకు సరిపడా నారుమళ్లు వేశారు. ఊటకాలువలు పూడిపోయి ఉండడంతో వర్షపు నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో నారుమళ్లు మునిగిపోయాయి.

పొలాల్లో వర్షపు నీరు నిలవకుండా చూసుకోవాలి

●**ఉదయగిరి:** దిత్వా తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు పీ చెన్నారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పంటలు సాగు చేసిన రైతులు కయ్యల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

●**దుత్తలూరు(ఉదయగిరి):** దిత్వా తుపాన్ ప్రభావంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు యనమల నాగరాజు సూచించారు. సోమవారం ఆయన మండలంలోని నర్రవాడ, ఎస్టీ కాలనీ, తెడ్డుపాడు తదితర గ్రామాల్లో పర్యటించారు. నీటి వనరుల దగ్గరకు వెళ్లరాదని, పిడుగులుపడే సమయంలో చెట్లకింద ఉండరాదని, అవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెంచలయ్య ఆశయాలను సాధిద్దాం

● నేడు బంద్


పెంచలయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఉదయగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంజాయి ముఠా చేతిలో నెల్లూరులో అత్యంత దారుణంగా హత్యకు గురైన పెంచలయ్య ఆశయాలను సాధిద్దామని సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్యలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెంచలయ్య హత్యకు నిరసనగా మంగళవారం ఉదయగిరిలో బంద్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజలు, ప్రజా సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, ఫరుద్దీన్ బాషా, నాయబ్, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం బస్సును కొనసాగించాలి

ఉదయగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో నుంచి విశాఖపట్నంకు వెళ్లే బస్సును అధికారులు రద్దు చేయాలని చూడడం దారుణమని, ఆ బస్సును అలాగే కొనసాగించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు షేక్ దస్తగిరిఅహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ఈప్రాంత వాసులు జీవనోపాధి కోసం అధికంగా దూర ప్రాంతాలకు వెళుతుంటారన్నారు. అలాంటి దూరప్రాంత బస్సులను అధికారులు రద్దు చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జోక్యం చేసుకుని ఈ బస్సు సర్వీసును రద్దు చేయకుండా కొనసాగించేలా చూడాలని ఆయన కోరారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ


సీతారామపురం: లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది

సీతారామపురం, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం సీతారామపురం గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు పిడుగు రమేష్, తెలుగు యువత నాయకుడు వికాష్‌బాబు, మండల ముస్లీం నాయకులు షేక్ బాబు, సొసైటీ చైర్మన్ రాజశేఖర్, బండి రవి, సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్ హసనయ్య, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

●**వింజమూరు** : పంచాయతీ పరిధిలోని బొమ్మరాజుచెరువు గ్రామంలో సోమవరం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, పశుసంవర్ధక శాఖ సహాయకులు వి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం


సీతారామపురం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

సీతారామపురం, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలు అవ గాహన కలిగి ఉండాలని డాక్టర్ నాగేంద్ర తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం స్థానిక పీహెచ్‌సి నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి నిఖిల్, పీహెచ్‌సి సిబ్బంది, 108 సిబ్బంది పాల్గొన్నారు.

●వింజమూరు: ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రిటైర్డ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మాసిలామణి పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం పురస్కరించుకుని సోమవారం స్థానిక మాసిలామణి వైద్యశాలలో ఎయిడ్స్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, ఎప్సీబా, మల్లికార్జున్, సుజిత్, శాంతి, కీర్తి, తిరుమలేశు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

వింజమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చంద్రపడియ గ్రామంలో సోమవారం సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లుయాదవ్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వాసు, పి మాల్యాద్రి, దొరస్వామినాయుడు, షేక్ మహబూబ్‌బాషా, గ్రామ రైతులు, తదితరులున్నారు.

●**ఉదయగిరి :** స్థానిక కొట్టాలపల్లి సొసైటీ కార్యాలయంలో సోమవారం మండలంలోని రైతులకు సొసైటీ అధ్యక్షుడు గడ్డం వెంకటసామయ్య యూరియా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా అవసరమైన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో పోలయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు...

ఉదయగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిరాశ్రయులకు సోమవారం ఐడియల్ యూత్ మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణంలో నివాసం లేని, రోడ్లపై, బస్‌షెల్టర్లలో ఉంటున్న వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్‌మునాఫ్, ఉదయగిరి అధ్యక్షుడు తారీఖ్‌అజీజ్, కార్యదర్శి హఫిజుల్లా, సభ్యుడు అజహరుల్లా తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

వీఆర్వో సంతకం ఫోర్జరీ

● పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దారు ఫిర్యాదు

అనంతసాగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్‌కు ఉపక్రమిస్తూ అడ్డంగా దొరికిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల మేరకు... మండలంలోని వరికుంటపాడు, ఉప్పలపాడు గ్రామాలకు వీఆర్వోగా జగదీష్ అనే వ్యక్తి విధులు నిర్వహిస్తున్నాడు. అయితే వరికుంటపాడుకు చెందిన ఒక వ్యక్తి వీఆర్వో సంతకంతో భూమి పత్రాలు రిజిస్ట్రేషన్ చేసేందుకు శని వారం ఆత్మకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ అధికారికి అనుమానం కలిగి సంబంధిత వీఆర్వోకి ఫోన్ చేసి సంతకాలు చేసిన విషయంపై ఆరాతీయగా తాను చేయలేదని చెప్ప డంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయింది. ఈ విషయాన్ని వీఆర్వో తహసీల్దారు జయవర్ధన్‌రెడ్డికి తెలపగా ఆయన సోమవారం పోలీ సులకు ఫిర్యాదు చేశారు.

పొలం వివాదం.. వృద్ధురాలిపై దాడి


గాయపడిన బుజ్జమ్మ

కలిగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పొలం వివాదంలో ఓ వృద్ధురాలిపై దాడి చేసి గాయపరిచిన ఘటన మండలంలోని తూర్పు గుడ్లదొనలో సోమవారం జరిగింది. బాధితురాలి కథనం మేరకు... దగదర్తి మండలం లింగాలపాడుకు చెందిన మునగాల బుజ్జమ్మకు తూర్పుగుడ్లదొనలో 12.60 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ క్రమంలో తమ భూములను గ్రామానికి చెందిన కోట ప్రసాద్ కుటుంబీకులు దున్ని నాట్లు వేస్తున్నారనే సమాచారంతో తన ఆడపడుచు లోకిరెడ్డి శ్రీదేవితో కలిసి సోమవారం ఆమె పొలం వద్దకు వెళ్లారు. పొలం దున్నే విషయమై వారిని ప్రశ్నించగా ప్రసాద్‌తోపాటు, తిరుపాలమ్మ, వెంకటేశ్వర్లు, తిరుపాలునాయుడులు కలిసి దాడికి పాల్పడ్డారు. వారినుంచి శ్రీదేవి తప్పించుకోగా బుజ్జమ్మకు తలపై గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని శ్రీదేవి, మరికొందరు చికిత్స నిమిత్తం 108 వాహనంలో కావలికి తరలించారు. ఘటన తర్వాత బాధితులు కావలి వెళ్లారని, ఈ విషయమై విచారణ చేపడతామని ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

నెల్లూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లారీని వెనుకకు నడుపుతున్న క్రమంలో ఓ యువకుడిని ఢీకొనడంతో అతను తీవ్రగాయాలపాలై మరణించినట్లు నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు సోమవారం తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు... టీపీగూడూరు మండలం సౌత్ ఆములూరు గ్రామానికి చెందిన ఓబిలి వేణు (27) ఆదివారం రూరల్లోని చిన్నచెరుకూరు రోడ్డు వద్దనున్న కాటన్ ఫ్యాక్టరీ ఎదుట ఉండే గోదాముల వద్ద నిలబడి ఉన్నాడు. అదే సమయంలో అక్కడున్న లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా వెనుకకు నడపడంతో వేణును లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ వేణును స్థానికులు నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ్నుంచి మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ఈ మేరకు వేణు బంధువు ఓబిలి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

శివాలయంలో చోరీ యత్నం

కలువాయి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలో ఆదివారం రాత్రి చోరీ యత్నం జరిగింది. ఆలయం తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లిన దుండగులు అక్కడ ఉన్న సీసీ కెమెరాలను, విద్యుత్ బోర్డులను కూడా ధ్వంసం చేశారు. బీరువా తెరిచి అంతా గాలించారు. అయితే విలువైన వస్తువులు ఏమీ ఆలయంలో ఉంచలేదని పూజారి నరసింహరావు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయానికి వెళ్లిన అయ్యప్ప భక్తులు ఈ విషయం గురించి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలాన్ని పరిశీ లించారు. ఆలయాల్లో చోరీలు చేసే ముఠా మండలంలో సంచరిస్తున్నట్లు గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్రాంచైజ్ పేరుతో రూ. కోట్లకు మోసం

● వందలాదిమంది బాధితులు
● న్యాయం చేయండి: గిరిధర్‌రెడ్డి


సీఐ వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న బాధితులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): గ్రామీణ హోం ఫుడ్స్ ఫ్రాంచైజ్ ఇస్తామని నమ్మించి రెండు తెలుగు రాష్ట్రాల్లోని వందల మంది నుంచి రూ.కోట్లు కట్టించుకుని మోసం చేశారని, బాధితులకు న్యాయం చేయాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి దర్గామిట్ట పోలీసులను కోరారు. గ్రామీణ హోం ఫుడ్స్ ఫ్రాంచైజ్ తీసుకున్న పలువురు మోసం పోయామని గుర్తించి సోమవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కార్యాలయానికి వచ్చారు. వారి బాధలు విన్న ఎమ్మెల్యే వెంటనే బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ, డీఎస్పీ, దర్గామిట్ట పోలీసులతో ఫోన్లో మాట్లాడారు. అనం తరం బాధితులతో కలిసి గిరిధర్‌రెడ్డి దర్గామిట్ట పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ఫ్రాంచైజ్ పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.3.50 లక్షలకుపైగా వసూలు చేశారని, ఇలా తెలుగు రాష్ట్రాల్లో వందల మందిని నగదు తీసుకున్నారని, నాలుగు నెలలైనా సరుకు ఇవ్వకపోగా, సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నారని తెలిపారు. దీంతో బాధితులు ఎమ్మెల్యే రూరల్ కార్యాలయానికి వచ్చారని, వారందరికీ న్యాయం చేయాలని సీఐని కోరారు. కాగా, పోలీసులు ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు చేయలేదు.

దిత్వా.. దిగులు

(5వ పేజీ తరువాయి)

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. విద్యాసంస్థలకు మంగళవారం కూడా సెలవు ప్రకటించారు. సోమశిల జలాశయానికి 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. నెల్లూరు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితి ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. అత్యవసర లైన్ డిపార్ట్‌మెంట్ల సిబ్బందికి సెలవులు రద్దు చేసి విధుల్లో కొనసాగిస్తున్నారు. బీచ్‌ల వద్దకు ఎవరూ వెళ్లకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి నెల్లూరులో ఉండి నివారణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

● నెల్లూరుకు దక్షిణ ఆగ్నేయంగా..

నెల్లూరుకు దక్షిణ ఆగ్నేయంగా తీవ్ర వాయుగుండం కేంద్రీకృతమై ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ ప్రభావంతో మంగళ, బుధవారాలలోనూ తేలికపాటి నుంచి భారీ వర్షాలతోపాటు 35 నుంచి 45 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.


మనుబోలులో నీటమునిగిన పంట పొలాలు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	268

కోడిగుడ్ల ధర (100): 665

ఉత్తమ సేవలకు గుర్తింపు

కలిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులకు అత్యుత్తమ సేవలందించినందుకు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్స వం సందర్భంగా కలిగిరి పీహెచ్‌సీ ఫార్మసీ ఆఫీసర్ మాచవోలు విజయకు గుర్తింపు లభించింది. ఈ మేరకు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత, ఎయిడ్స్ నియంత్రణ అధికారి షేక్ ఖాదర్‌వలిలు ఆమెకు ప్రశంసాపత్రం, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, వైద్య సిబ్బంది విజయకు అభినందనలు తెలిపారు.



డీఎంహెచ్‌వో నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న విజయ

400 ఎకరాల

ప్రభుత్వ భూముల కబ్జా!


ఆర్ఆర్‌పాలెం కండేవారిబీడులో ఆక్రమిత భూముల్లో నాటిన జామాయిల్ మొక్కలు

రాజకీయ పలుకుబడికి ధన బలం తోడైతే ఏమైనా చేయవచ్చనేందుకు నిదర్శనం ఆర్ఆర్ పాలెంలో ప్రభుత్వ భూముల కబ్జా. ఒక నిరుపేద.. లేదా ఓ పేద రైతు ఒక అంకణమో, ఒక సెంటో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే గద్దల్లా వాలిపోయే అధికార యంత్రాంగం ఒకే వ్యక్తి ఏళ్ల తరబడి సుమారు 100 ఎకరాలు ప్రభుత్వ గ్రేజింగు భూములు ఆక్రమించి పంటలు సాగు చేస్తుంటే తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారంటే దాని అర్థమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇలా ఒక్క రైతే కాదండోయ్ సుమారు 40 నుంచి 50 మంది రైతులు 5 నుంచి 60 ఎకరాల చొప్పున రూ.20 కోట్ల విలువైన 400 ఎకరాలు (160 హెక్టార్లు) భూములు ఆక్రమించి యథేచ్ఛగా జామాయిల్, పొగాకు సాగు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అదికూడా ఒక గ్రామ పరిధిలోకి ఇతర గ్రామాల భూస్వాములు వచ్చి భూములు ఆక్రమించి సాగు చేయడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. ఇదంతా నమ్మబుద్ధి కావడం లేదా.. కానీ ఇది నిజం.. ఇంకా నమ్మబుద్ధి కాకుంటే ఆర్ఆర్ పాలెంలోని కండేవారిబీడులోని ప్రభుత్వ గ్రేజింగు భూముల్లోకి వస్తే కబ్జా అయిన భూములను కళ్లారా చూడవచ్చు. - లింగసముద్రం,(ఆంధ్రజ్యోతి)

- సుమారు 160 హెక్టార్ల ఆక్రమణ
- ఒక్కొక్కరు 5 నుంచి 100 ఎకరాల్లో తిష్ట
- యథేచ్ఛగా జామాయిల్, పొగాకు సాగు
- ఆక్రమణదారులంతా మొగిలిచెర్ల, నారసింహాపురం భూ స్వాములే..
- భూములను కాపాడాలని ఆర్ఆర్ పాలెం వాసుల ఆందోళన
- ఏళ్ల తరబడి అధికారులకు ఫిర్యాదు
- గత నెలలో బోర్డులు పెట్టినా పీకేసిన అక్రమార్కులు

లింగసముద్రం మండలంలోని ఆర్ఆర్ పాలెం గ్రామ పరిధిలోని కండేవారిబీడులో వందల ఎకరాల ప్రభుత్వ గ్రేజింగు భూములు ఉన్నాయి. వీటి విలువ ఎకరా రూ.5 లక్షలు ఉంటుంది. ఆ లెక్కన ఆక్రమణలకు గురైన సుమారు 400 ఎకరాలు ధర రూ.20 కోట్లకు పైబడి ఉంటుందని అంచనా. ఈ భూములను మండలంలోని మొగిలిచెర్ల, నారసింహాపురం గ్రామాలకు చెందిన భూస్వాములు ఆక్రమించి జామాయిలు, పొగాకు దర్జాగా సాగు చేస్తున్నారు. వాస్తవానికి పొగాకు పంట ఆక్రమిత భూముల్లో సాగు చేసేందుకు బోర్డు అనుమతి ఇవ్వదు. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా ఎక్కడో బ్యారన్లు చూపించి ఆక్రమిత భూముల్లో పొగాకు సాగు చేస్తున్నారు. ఇది బోర్డు అధికారులకు తెలిసినా పట్టించుకునే నాథుడు లేరు. ఈ భూముల ఆక్రమణదారుల్లో కొందరు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పంచన చేరుతుండగా మరికొందరు ఏ పార్టీలోనైనా చక్రం తిప్పుతూ ఆక్రమిత భూముల జోలికి ఎవరూ రాకుండా కాపాడుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో యథేచ్ఛగా పంటలు సాగు చేస్తూ ఏటా లక్షలాది రూపాయలను అక్రమంగా ఆర్జిస్తున్నారు. మరికొందరు ఆక్రమించిన భూములను ఎకరం రూ.10 వేల వంతున కౌలుకి ఇస్తున్నారు. కందుకూరు, కావలి, లింగసముద్రం తదితర ప్రాంతాలకు చెందిన రైతులు కౌలుకు తీసుకొని పొగాకు సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు కండేవారిబీడులో సుమారు 400 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురయ్యాయని గ్రామస్థులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తమ గ్రామ ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించి భూములను స్వాధీనం చేసుకోవాలని ఆర్ఆర్‌పాలెం వాసులు ఏళ్లతరబడి ప్రజాప్రతినిధులు, మండల, జిల్లాస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. అయినా వీరి మొర ఆలకించే నాథుడు కరువయ్యారు. దీంతో వారంతా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్న

సేపథ్యంలో గతనెలలో


ఆక్రమిత భూముల్లో సాగు చేసిన పొగాకు పంట

ఆక్రమిత భూములు ప్రభుత్వానికి సంబంధించినవని, వీటిలో ఎవరూ దిగకూడదని, ప్రభుత్వ హెచ్చరికను బేఖాతరు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అది మూణ్నాల ముచ్చగా మారి ఆ బోర్డులను ఏర్పాటు చేసిన మూడు రోజుల్లోనే ఆక్రమణదారులు పీకి పారేశారు. అయినా పట్టించుకునే వారు లేరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆర్ఆర్ పాలెం గ్రామస్థులు కోరుతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం

మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో గ్రేజింగ్ భూములు సుమారు 88 ఎకరాలు ఆక్రమించిన ఆక్రమణదారులు 13 మందిపైన, లింగసముద్రంకు చెందిన ఆక్రమణదారులు 14 మందిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. అలాగే లింగసముద్రం, వెంగళాపురం, మాలకొండరాయునిపాలెం, పెంట్రాల, ఆర్ఆర్ పాలెం, మొగిలిచెర్ల, రాళ్లపాడు, పెదపవని గ్రామాలలో అన్ని రకాల ప్రభుత్వ భూములు ఆక్రమణలు గుర్తిస్తాం. వర్షాలు తగ్గిన తరువాత తమ సిబ్బంది ద్వారా ఆక్రమణదారులను గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తాం.

- ఎం.కోటేశ్వరరావు, తహసీల్దారు

నేటి జిల్లా బంద్‌ను జయప్రదం చేయండి


సమావేశంలో పాల్గొన్న వామపక్ష పార్టీలు, ఎమ్మార్పీఎస్ నేతలు

కావలి(టౌన్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు పెంచలయ్యను గంజాయి మూకలు హత్య చేసి చంపడాన్ని ఖండిస్తూ మంగళవారం నిర్వహించ తలపెట్టిన జిల్లా బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల నేతలు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వామపక్ష పార్టీలు, ఎమ్మార్పీఎస్ నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, తిరుపాలు, కృష్ణమోహన్, సీపీఐ నేతలు దర్గాబాబు, బోసు, ఎమ్మార్పీస్ నేతలు చేవూరి కిరణ్, రాపూరి శివలు మాట్లాడారు. ప్రజా ఉద్యమాలే ఊపిరిగా గంజాయి మహమ్మారిని అరికట్టాలన్న దృఢసంకల్పంతో ఉద్యమిస్తూ యువతను చైతన్యపరుస్తున్న పెంచలయ్యను గంజాయి మూకలు హత్య చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి లేకుండా చేస్తామని, గంజాయి మూకలను ఉక్కుపాదం మోపతామని చెప్తున్న మాటలు ఆచరణలో జరగటం లేదన్నారు. గంజాయిని అరికట్టి యువతను పెడదోవ పట్టకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

తహసీల్దారు సీతామహాలక్ష్మికి సన్మానం

జలదంకి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారుగా గత శనివారం బాధ్యతలు చేపట్టిన సీతామహలక్ష్మిని టీడీపీ మండల అధ్యక్షుడు మున గాల తిరుమలరెడ్డి సోమ వారం ఆమె కార్యాలయం లో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరి ష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. మండలంలో రీస ర్వే జరిగే గ్రామాల్లో అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.


తహసీల్దారుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నేత

టీఆర్ఆర్‌లో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

కందుకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఎయిడ్స్‌పై విద్యార్థినీ విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్, రంగోలి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి ఇప్పటికీ సైలెంట్ కిల్లర్‌లా ఉందని, విద్యార్థులంతా ఎయిడ్స్ పట్ల సంపూర్ణ అవగాహనతో అప్రమ త్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమం అనంతరం ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించే ప్లేకార్డులతో విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కోటపాటి నరేష్‌రాజా, కేవీ పద్మావతి, వీ.రాజ గోపాలబాబు తదితరులు పాల్గొన్నారు.


ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

జేబీ డిగ్రీ కళాశాలలో..

● కావలి(టౌన్) : జేబీ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పించారు. రెడ్ రిబ్బన్ ఆకారంలో విద్యార్థులు నిలబడి ఎయిడ్స్ మహమ్మారిని అరికడతామని, ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేస్తామని నినాదాలు చేశారు. విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, ఫేస్ పెయింటింగ్, రంగోలి పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యంనాయుడు, స్వయం ఉపాధి కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి, క్లబ్ కోఆర్డినేటర్ వసుంధరదేవి పాల్గొన్నారు.


రెడ్ రిబ్బన్ ఆకారంలో విద్యార్థులు

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం : ఇంటూరి


ఉలవపాడు : పింఛను అందచేస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు


బిట్రగుంట : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగుమాటి

ఉలవపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమంతోపాటు రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ఉలవపాడులోని మసీదు సెంటర్ ఏరియాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను నగదు అందజేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుంటు వెంటనే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మంచినీటి కళాయిలు, డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేదని, ఏళ్ల తరబడి ముస్లింలకు చెందిన బజారు ఆక్రమణకు గురైయిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు ముస్లింలు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరించాలని తహసీలాదరు శ్రీనివాసులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు కేటాయించిన బడ్జెట్‌ను ఆ యా గ్రామాల అభివృద్ధికే పూర్తిస్థాయిలో వినియోగిస్తూ గ్రామాలు సుభిక్షంగా ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీక్షతో పనిచేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు నాగలక్ష్మి, నాయకులు రాచగల్లు సుబ్బారావు, గిరి సారాయిబాబు, కరీం, పొదిలి మాబాషా, పఠాన్ రాహుల్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.


కలిగిరి : పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

● అర్హులందరికీ పింఛన్లు : ఎమ్మెల్యే దగుమాటి

బిట్రగుంట : అర్హులందరికీ పింఛన్లు అందచేయడమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలం ముంగమూరులో సోమవారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛనఖ నగదు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. 2018-19లో నిర్మాణం చేపట్టి వివిధ దశల్లో ఉన్న పక్కా గృహాలకు బిల్లులు ఇవ్వలేదని గిరిజనులు ఎమ్మెలేకు విన్నమించుకున్నారు. స్పందించిన ఆయన హౌసింగ్ అధికారులతో ఫోన్లో మాట్లాడి వీలైనంత త్వరగా బిల్లులు మంజూరయ్యేలా చర్యలు చేపడతాం అన్నారు. పశువైద్య శాల శిథిలావస్థకు చేరిందని స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, జనసేన నేత సిద్దు, టీడీపీ నేతలు కండ్లగుంట మధుబాబునాయుడు, యన్నాబత్తిన వెంకటేశ్వర్లు, ఎల్.సుధీర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బోగోలు మండల టీడీపీ యువనేత గోచిపాతల సంజయ్ తల్లి గోచిపాతల స్నేహలత (62) అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అక్కడికి వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, గిరిజన నేత బోగిరిప్రభాకర్, టీడీపీ నేతలు కుంచాల తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు మల్లి అరుణమ్మ, తదితరులు ఉన్నారు.

● పెన్షన్ పేద కుటుంబాలకు ఆసరా : ఎమ్మెల్యే

కలిగిరి : ఎటువంటి ఆసరా లేని పేదకుటుంబాలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఎంతగానో ఆదుకుంటుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని గంగిరెడ్డిపాలెంలో జరిగిన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాట ప్రకారం రూ.4వేలు పెన్షన్ అందిస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సూరేపల్లి మాధవ, స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **కొండాపురం :** మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ 87 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మొత్తం 5,336 మంది లబ్ధిదారులు ఉండగా 4,653 మందికి పింఛన్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల కన్వీనర్ పోలినేని చంద్రబాబునాయుడు, నాయకులు పోలినేని రమేష్, దాసరి అశోక్, జాగర్లమూడి శ్రీను, చాగంటి క్రిష్ణ, జీ.మాధవ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● **జలదంకి :** మండల కేంద్రం జలదంకిలో సోమశిల ప్రాజెక్ట్ వైస్‌చైర్మన్ పీ.మధుమోహన్‌రెడ్డి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు నగదు అందజేశారు. జమ్మలపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. తిమ్మసముద్రంలో టీడీపీ నేత కంచర్ల వినోద్‌నాయుడు, బీ.కెఅగ్రహారంలో టీడీపీ నాయకులు స్వర్ణ కొండపనాయుడు, ఎల్.దశరథరామానాయుడు పింఛన్లు పంపిణీ చేశారు.

వైభవంగా కలశాలతో బాలాలయ ప్రవేశం

కలిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కలిగిరి పట్టణంలోని పర్వతవర్ధిని జానకిరామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణాన్ని పురస్కరించుకుని సోమవారం బాలాలయ ప్రవేశం వైభవంగా జరిగింది. సుమారు 200 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా కలశాలతో బాలాలయ ప్రవేశం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తుల ఓం నమఃశివాయ నామస్మరణలతో, వేదపండితుల మంత్రోశ్చరణాల మధ్య వైభవంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొనగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, జడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కలశాలతో ఆలయం ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, నిర్వాహకులు

ప్రమాదకరంగా ఫ్లెక్సీలు!

● వర్షం వచ్చినా.. గాలి వీచినా పడిపోతున్న వైనం


వెంగళరావునగర్ వసతిగృహాల మలుపు వద్ద పడిపోయిన ఫ్లెక్సీ

కావలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి. కొద్దిపాటి వర్షం వచ్చినా.. చిన్న గాలి వీచినా ఎక్కడ ప్రజలపై, వాహనచోదకులపై కూలుతాయోననే భయం నెలకొంది. దిత్వా తుఫాన్ ప్రభావంతో మున్సిపల్ అధికారులు ముందు జాగ్రత్తగా అనేక చోట్ల ఫ్లెక్సీలు తొలగించినా ఇంకా అనేకం వదిలి వేశారు. తుఫాన్ ప్రభావం లేకపోయినా ఓమోస్తరు వర్షానికే అనేక చోట్ల ఫ్లెక్సీలు కిందపడి ప్రజల రాకపోకలకు ఆటంకంగా మారాయి. ఇంకా అనేక చోట్ల వర్షాలకు ఒరిగి ఉన్న ఫ్లెక్సీలు ఎక్కడ పడతాయోనని ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో ఎక్కడా నిబంధనలు పాటించకుండా మున్సిపల్ అనుమతుల తీసుకోకుండా ప్రజలకు ఇబ్బందికరంగానే ఫ్లెక్సీలు కడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకవేళ ఎక్కడైనా మున్సిపల్ అధికారులు అభ్యంతరం చేసినా ఫ్లెక్సీలు కట్టే వారికి అధికారపార్టీ నాయకుల మద్దతు ఉండటంతో ఎవరిని కాదనలేకపోతున్నారు. ఇలాంటి పరిస్థితులలో పట్టణంలో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలకు ఒక ప్రామాణికం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుడా ప్రమాదలకు తావివ్వకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

మునునూరు ఇందిరమ్మ కాలనీ జలమయం


కోతకు గురైన ముసునూరు అట్టల ఫ్యాక్టరీ నుంచి ఆర్పి వైపు రోడ్డు

కావలిరూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): చినుకుపడితే ముసునూరు ఇందిరమ్మకాలనీ జలమయం అవుతోంది. సుమారు 20 ఏళ్ల క్రితం 6000 మంది పేదలకు ముసునూరులోని రైల్వే ట్రాక్‌కు పడమర వైపున నివేశన స్థలాలు కేటాయించారు. ప్రభుత్వాలు మారుతున్నా నాటి నుంచి నేటికీ అక్కడ నివశిస్తున్న పేదలకు తాగునీరు, రోడ్ల వంటి వసతులు కల్పించకపోగా కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేస్తున్నారు. వర్షాలకు నివాసాల మధ్యన వర్షపు నీరు నిల్వ చేరుతుండడంతో అత్యవసర సమయాల్లో కూడా ఇళ్ల నుంచి బయటకు రాలేని స్థితిలో స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారడంతో పాటు రోడ్లపై వర్షపు నీటితో బురదమట్టి మేట వేసి కోతకు గురైన రోడ్లతో రాకపోకలకు తరచూ ప్రమాదాల బారిన పడాల్సి వస్తుంది. ప్రభుత్వాలు మారినా తలరాతలు మారడం లేదని, పేదలు నివశించే కాలనీలో కనీసం వీధి దీపాలు కూడా వెలగటం లేదని, అధికారులు, పాలకులు స్పందించి అంతర్గత రోడ్లు, తాగునీటి వసతులు కల్పించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

కొండాపురంలో చిరుజల్లులు


భీమవరప్పాడులో బురదమయమైన సీసీ రోడ్డు

కొండాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో మండలంలో సోమవారం చిరుజల్లులు కురిశాయి. 3 మిమీటర్లు వర్షపాతం నమోదయినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. చిరుజల్లులతో సీసీ రోడ్లు సైతం బురదమయంగా మారి రోడ్డుపై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నీట మునిగిన వరినాడుమడులు, నాట్లు

జలదంకి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలుచోట్ల, ప్రధానంగా బ్రాహ్మణక్రాక మేజర్ కాలువ, కాకమ్మచెరువు కింద వేసిన వరినాట్లు అధిక శాతం నీట మునిగాయి. వారం రోజుల వ్యవధిలో వేసిన వరినాట్లు కావడంతో దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి నారుమళ్లు కూడా చాలాచోట్ల నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

లోతట్టు ప్రాంతాల్లో అధికారుల పర్యటన


శివరామసుబ్బయ్య కాలనీలో గిరిజనులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

కావలి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో కావలిలో కురిసిన వర్షాలకు పరిస్థితులను తెలుసుకునేందుకు సోమవారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, ఏఈ వినోద్ తదితరులు పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా కావలి చెరువుకట్ట వద్ద ఉన్న శివరామసుబ్బయ్య కాలనీలో పర్యటించి అక్కడ గిరిజనుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు ఎక్కువై ఏదైనా ఇబ్బందులు ఎదురైతే తమదృష్టికి తెస్తే వెంటనే తగు సహాయక చర్యలు చేపడతామని చెప్పారు. తమ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తున్నారన్నారు. అనంతరం వైకుంఠపురంలోని అన్నపుగుంట ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ వర్షపు నీరు నిల్వలను బయటకు పంపేందుకు చర్యలు చేపట్టారు.

దిత్వా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉన్నాం

కలిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ పట్ల మండలంలో పూర్తిస్థాయిలో ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తహసీల్దారు గిరీష్‌కుమార్ తెలిపారు. తుఫాన్ ప్రభావం ముగిసే వరకు ప్రత్యేక అధికారులను నియమించడం, లోతట్టుప్రాంత ప్రజలను సురక్షితప్రాంతానికి తరలించడంతోపాటు, ప్రమాదకర వంతెనల వద్ద ముందస్తు రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

వరద నీరు చేరితే సమాచారం ఇవ్వండి

అల్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంగా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వరదనీరు ప్రవహిస్తే వెంటనే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని పలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటించి పలు సూచనలు ఇచ్చారు. అదేవిధంగా కాలువలు, వాగుల్లో వరద ప్రవాహం పెరిగినట్లయితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు. అనంతరం అల్లూరు చెరువు, రామన్న చెరువులను పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 132-33 కేవీ సబ్ స్టేషన్‌లో ఆధునీకరణ, రిలే ప్యానెల్ రీప్లేస్‌మెంట్ పనులు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతాయని, ఈ సమయంలో దీని పరిధిలోని 33-11కేవీ సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం జరుగుతుందని ఆపరేషన్స్ ఈఈ వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రజలు, రైతులు అసౌకర్యాన్ని గుర్తించి సహకరించాలని పేర్కొన్నారు.

● సామ్ వెడ్స్ రాజ్



సమంత మన ఊరి కోడలు

నటి సమంత పెళ్లి చేసుకుంది. తిరుపతికి కోడలైంది. ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ నిర్మాత, దర్శకుడు, రచయిత రాజ్ నిడిమోరును కోయంబత్తూరులో ఈషా కేంద్రంలోని లింగ భైరవ ఆలయంలో సోమవారం వివాహం చేసుకుంది. రాజ్‌ది తిరుపతి. 1975 ఆగస్టు 4న జన్మించారు. ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ పూర్తి చేస్తుండగా సహచర విద్యార్థి కృష్ణ డీకే ఇతడికి పరిచయమయ్యారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా డీకేతో కలసి సినిమాటోగ్రఫీలో ప్రవేశించారు. ఎనిమిది సినిమాలకు దర్శకుడిగా, రచయితగా పని చేశారు. 2015లో శ్యామల అనే అసిస్టెంట్ డైరెక్టర్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఓ కుమార్తె ఉంది. 2022లో విడిపోయారు. ఇతడు తీసిన స్త్రీ సినిమాకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు వచ్చింది. ఇతడి దర్శకత్వంలో సమంత నటించిన 'ఫ్యామిలీ మ్యాన్' వెబ్‌సిరీస్ సూపర్ హిట్ అయ్యింది. ఇటీవల సమంత నిర్మించిన శుభం చిత్రానికి రాజ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్‌తో వీరి మధ్య పరిచయం ఏర్పడింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి






విరిగిన ఏనుగు కాలుకు స్కానింగ్ - లారీలోకి ఎక్కిస్తున్న సిబ్బంది -తిరుపతికి లారీలో తరలింపు -జూలో క్రేన్ సాయంతో లారీలోంచి కిందకు దించుతూ...

'ఆపరేషన్ గజ' సక్సెస్

కాలు విరిగిన ఏనుగుకు కుంకీల సాయం

ఎస్వీ జూకు తరలించి వైద్య చికిత్సలు

యాదమరి/మంగళం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండల పరిధిలో కాలు విరిగి నడవలేని స్థితిలో ఉన్న ఒంటరి ఏనుగును తరలించేందుకు అటవీశాఖ చేపట్టిన 'ఆపరేషన్ గజ' సోమవారం విజయవంతంగా ముగిసింది. భారీ క్రేన్ సాయంతో ఏనుగును లారీలో ఎస్వీ జూ పునరావాస కేంద్రానికి తరలించారు. తమిళనాడు రాష్ట్రం నుంచి వారం క్రితం యాదమరి మండలంలోకి ప్రవేశించిన ఈ ఒంటరి ఏనుగు రెండ్రోజుల క్రితం డీకే చెరువు సమీపంలోని కమ్మపల్లి అటవీ బీట్ గుడ్డివానిచెరువు వద్ద జారిపడడంతో కాలు దెబ్బతిని కదల్లేని స్థితికి చేరుకున్న విషయం తెలిసిందే. ఆదివారం సీసీఎఫ్ యశోదా బాయి ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు, వైద్యులు వచ్చి పరిశీలించారు. పలమనేరు సమీపంలోని ముసలిమడుగు నుంచి కుంకీ ఏనుగులు కృష్ణ, అభిమన్యులను రప్పించి మధ్యాహ్నం మూడు గంటల నుంచి సహాయక చర్యలు చేపట్టారు. చెరువు నుంచి కుంకీల సాయంతో ఒంటరి ఏనుగును బయటకు తీసుకొచ్చారు. అప్పటికి చీకటి పడడంతో ఆపరేషన్‌కు తాత్కాలికంగా విరామం ఇచ్చారు. సోమవారం ఉదయం అటవీశాఖ సిబ్బంది తమ ప్రయత్నాలను పునః ప్రారంభించారు. కుంకీల సహాయంతో దెబ్బతిన్న ఏనుగును కదలకుండా చేశాక దెబ్బతిన్న ఏనుగు కాలును స్కాన్ చేశారు. అనంతరం భారీ క్రేన్‌ను ఉపయోగించి ఏనుగును క్షేమంగా లారీలోకి ఎక్కించారు. అటవీ, పోలీసుల కాన్వాయ్ సహకారంతో ఏనుగును సోమవారం మధ్యాహ్నానికి తిరుపతిలోని ఎస్వీ జూకు తీసుకొచ్చారు.ఈ తరలింపు ప్రక్రియను డీఎఫ్‌వో శ్రీనివాసులు, రేంజర్లు థామస్, పట్టాభి తదితరులు పర్యవేక్షించారు. జూకు తీసుకువచ్చిన ఏనుగును అధికారులు అతికష్టం మీద భారీక్రేన్ సాయంతో ఏనుగుల ఎన్‌క్లోజర్‌లోకి పంపారు. ఏనుగుకు వెనుకవైపు ఉన్న ఎడమకాలు విరిగిందని జూ అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్‌చంద్ర ప్రసాద్ తెలిపారు. కాలుకు ఎక్స్‌రే తీసి బ్లడ్ శాంపిల్స్ సేకరించామని... ఏనుగు ఆరోగ్యం బాగానే ఉందని కాలు విరగడం వల్ల నడవలేకపోతోందని చెప్పారు. ఇప్పటికే ఏనుగుకు ఇద్దరు డాక్టర్లు వైద్యం అందిస్తున్నారని ఆహారం కూడా తీసుకుందని వివరించారు.



ఎన్‌క్లోజర్‌లోకి ఏనుగు తరలింపు

తప్పిన దిత్వా ముప్పు!


● బలహీనపడిన తుఫాను ● మరో రెండు రోజులు వర్ష సూచన



బీఎన్‌కండ్రిగ మండలం నెరిణికండ్రిగ వద్ద నీట మునిగిన వరి

సూళ్లూరుపేట/తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 'దిత్వా' ముప్పు తప్పింది. తుఫాను బలహీన పడినా.. దాని ప్రభావంతో వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సోమవారం రాత్రి ఉత్తర తమిళనాడు పుదుచ్చేరి మీదుగా చెన్నైకు తూర్పు 10 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. అర్ధరాత్రికి వాయుగుండం బలపడే అవకాశంఉంది. దీంతో మంగళవారం జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణశాఖ తెలియజేసింది. మరోవైపు సోమవారం తెల్లవారు జాము నుంచి జడివాన కురుస్తోంది. తేలికపాటి వర్షాలు కావడంతో ఇప్పటి వరకు ఆస్తి, పంట నష్టాలు సంభవించలేదు. శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడులో నాలుగు పూడిగుడిసెలు నేలకూలాయి. నాయుడుపేట-వెంకటగిరి మార్గంలో స్వర్ణముఖి నదిలో నీటి ప్రవాహానికి ఒకరు కొట్టుకుపోతుండగా పోలీసులు సురక్షితంగా బయటకు తీశారు. ఇక, కలెక్టర్ వెంకటేశ్వర్ ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇక, కోట మండలం శ్రీనివాససత్రం, గోవిందపల్లి పాళెం, యమదిన్నెపాళెం ప్రాంతాల్లో భారీ అలలు ఎగిసిపడుతూ సముద్రం కొన్ని మీటర్లు ముందుకువచ్చింది.

వర్షపాతం: మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం 6గంటల వరకు సత్యవేడులో 38.2 మి.మీ., తడలో 37.4, వరదయ్యపాళెంలో 35.8, బీఎన్ కండ్రిగలో 30.4, సూళ్ళూరుపేటలో 24, ఓజిలిలో 20.8, పెళ్లకూరులో 20.4, కేవీబీపురంలో 18.6మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. మరో 11 మండలాల్లో చినుకులు తప్ప పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు.



మల్లిమడుగులో 9 గేట్ల ఎత్తివేత

రేణిగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాంకు 2100 క్యూసెక్కుల నీళ్ల వస్తోంది. దీంతో సోమవారం ఉదయం 9 గేట్లను ఒక అడుగు పైకి ఎత్తి 2400 క్యూసెక్కుల నీటిని వదులుతున్న డీఈ చంద్రమౌళి తెలిపారు.



కాళంగిలో రెండు గేట్లు ఎత్తివేత

కేవీబీపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):కేవీబీపురం మండలంలోని కాళంగి జలాశయం నీటి మట్టం 18.6 అడుగులకు చేరుకుంది. దీంతో సోమవారం రెండు గేట్లను రెండు అడుగుల చొప్పున ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినట్టు ఆయకట్టు అధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు.

సూత్రధారి.. పాత్రధారి భూమనే



తిరుమల పరకామణి కేసులో సూత్రధారి, పాత్రధారి వైసీపీ నేత భూమన కరుణాకరరెడ్డే. చోరీ చేసిన దొంగ నుంచి ఆస్తుల బదలాయింపు ఆయనకే జరిగింది. కేసులో ఆయన ఉన్నందునే వ్యంగ్యంగా మాట్లాడుతున్నారు. కల్తీ నెయ్యి కేసులోనూ తప్పు జరిగినట్లు విచారణలో అందరూ అంగీకరించారు. కానీ తప్పు మాత్రం ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారు.

- తిరుపతిలో మంత్రి అనగాని సత్యప్రసాద్

కల్యాణమస్తు పేరిట తాళిబొట్లు అమ్ముకున్నాడు



శ్రీవారిని నల్లరాయి అని, తిరుమల కొండను బోడిగుండని తిరుమల ప్రతిష్ఠను దిగజార్చారు. కల్యాణమస్తు పేరుతో తాళిబొట్లను అమ్ముకున్నాడు. ఆచారాలు, సంప్రదాయాల పేరుతో వ్యాపారం చేశాడు. సీఐడీ విచారణ తర్వాత భూమన వెటకారంగా మాట్లాడడం విడ్డూరం. పరకామణి చోరీ కేసును రాజీచేయడానికి నీవెవరు? పాపాలన్నీ బయటపడుతున్నా బరితెగించి మాట్లాడడం సిగ్గుచేటు.

- ఓవీ రమణ, టీటీడీ మాజీ సభ్యుడు

హోటళ్లకు మళ్లీ బాంబు బెదిరింపు

● ఫేక్ మెయిల్స్‌గా తేల్చిన పోలీసులు



రాజ్‌పార్కు హోటల్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మరోసారి బాంబు బెదిరింపు కలకలం సృష్టించింది. కపిలతీర్థం వద్దనున్న పాయ్ వైశ్రాయ్, రాజ్ పార్కు హోటళ్ల వద్ద ఐఈడీ బాంబులు పెట్టామని, ఏ క్షణమైనా పేలతాయంటూ పాక్ ఐఎస్ఐ పేరిట సోమవారం మెయిల్స్ వచ్చాయి. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రాంకిషోర్, ఎస్ఐలు అజిత, నాగార్జున రెడ్డి, బాంబు స్క్వాడ్ ఎస్ఐ పీరయ్య, సిబ్బంది మెటల్ డిటెక్టర్లు, బాంబు నిర్వీర్యం పరికరాలతో రెండు హోటళ్లలో నిశితంగా తనిఖీలు చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు తనిఖీలు చేశాక.. ఎలాంటి పేలుడు పదార్థాలు, ఐఈడీ బాంబులు లేవని నిర్ధారణకు వచ్చారు. కాగా, ఏడాదిగా తిరుపతిలోని పలు హోటళ్లు, వివిధ రకాల సంస్థలు, ఇస్కాన్ మందిరానికి బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. వీటిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కలెక్టరేట్‌లో డీఆర్సీ మీటింగ్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా సమీక్షా సమావేశం(డీఆర్సీ) జరగనుంది. వివిధ శాఖల పనితీరు, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై సమీక్షించనున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ వెంకటేశ్వర్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొననున్నారు.

చర్చించే అంశాలు

- మొంథా తుపానుతో నష్టాలు, తీసుకున్న సహాయక చర్యలు.
- కేవీబీపురం మండలం గూళ్లూరు రాయల్ చెరువుకు గండిపడటంతో నష్టపోయిన వారికి ఎలాంటి సహాయం అందించాలి.
- శెట్టిపల్లె భూముల్లో అభివృద్ధి పనులు.
- గ్రేటర్ తిరుపతికి కార్పొరేషన్ ఆమోదించింది. విలీనానికి పలు పంచాయతీలు అభ్యంతరం చెబుతున్నాయి. దీనిపైనా చర్చ జరగనుంది.
- జనవరి 11, 12 లేదా 17, 18 తేదీల్లో సూళ్లూరుపేటలో పక్షుల పండుగ నిర్వహణ, ఏర్పాట్లపై సమీక్షించనున్నారు.
- తిరుపతి నగరం గాంధీరోడ్డులో శిథిలావస్థకు చేరుకున్న హథీరాం మఠం భవనాన్ని ఏం చేయాలనే దానిపై ఒక నిర్ణయానికి రానున్నారు.

ఏం జరిగిందో.. ఏమో?

దామినేడులో ముగ్గురి అనుమానాస్పద మృతి ● ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన




మనీష్, ఫూన్‌గొట్బాయి (ఫైల్‌ఫొటోలు)

తిరుచానూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆమెకు వివాహమైంది. మగబిడ్డ ఉన్నాడు. ఆ బిడ్డతో ప్రియుడి వద్దకు వచ్చేసింది. ముగ్గురూ కలిసి తిరుపతి రూరల్ మండలం దామినేడులో ఉంటున్నారు. ఏం జరిగిందో ఏమో గానీ.. అతడు ఫ్యానుకు వేలాడుతూ.. ఆమె, బిడ్డ బాత్‌రూమ్‌లో విగతజీవులుగా పడుండటం సోమవారం వెలుగు చూసింది. ఆ గది తలుపునకు లోన గడియ పెట్టిఉండగా బయట తాళం వేసి ఉండటం అనుమానాలకు తావిస్తోంది. తిరుచానూరు ఎస్ఐ అరుణ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గుడియాత్తానికి చెందిన సత్యరాజ్(36), ఫూన్‌గొట్బాయి(21) ఇష్టపడ్డారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఆమెకు వేరే వ్యక్తితో పెళ్లయింది. కుమారుడు మనీష్(3) ఉన్నాడు. ఆరు నెలల కిందట భర్తను వదలి ఆమె బిడ్డతో కలిసి సత్యరాజ్ వద్దకు వచ్చింది. ఈ ముగ్గురూ కలిసి తిరుపతి రూరల్ మండలం దామినేడు హౌసింగ్‌కాలనీలో అద్దెకు ఉంటూ కూలి పనులు చేసుకునేవారు. వారం కిందట తిరుపతిలోని తమ సమీప బంధువుతో మాట్లాడారు. ఆ తర్వాత వారి నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో సోమవారం వారి బంధువులు ఇంటికి వచ్చారు. లోపల నుంచి దుర్వాసన వస్తోంది. బయట తాళం వేసి ఉంది. అనుమానం వచ్చి తిరుచానూరు పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ సునీల్‌కుమార్, ఎస్ఐ అరుణ, సిబ్బంది అక్కడికి వెళ్లారు. లోపల తలుపునకు గడియ పెట్టి ఉంది. తలుపు పగులగొట్టి లోపలకు వెళ్లగా సీలింగ్‌కు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని సత్యరాజ్.. పక్కనే బాత్‌రూమ్‌లో ఫూన్‌గొట్బాయి, మూడేళ్ల మనీష్ విగతజీవులుగా పడున్నారు. వారం కిందట మృతి చెందినట్లు భావిస్తున్నారు. అనుమానాస్పద రీతిలో మృతిగా కేసు నమోదు చేసి మూడు మృతదేహాలను రుయా మార్చురీకి తరలించారు. ముగ్గురూ కలిసి ఆత్మహత్యకు పాల్పడ్డారా లేదా తల్లీ బిడ్డకు విషమిచ్చి సత్యరాజ్ ఉరేసుకున్నాడా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. లోపల గడియ వేసి ఉండటం.. బయట తాళం వేసి ఉండటంతో మరో కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

జిల్లా కేంద్రమా.. నెల్లూరులో విలీనమా?

● ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలంటూ గూడూరులో జేఏసీ నిరసన

గూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గూడూరును జిల్లా చేస్తారా? లేదా నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తారా? ఈ రెండింటిలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలంటూ జేఏసీ నేతలు డిమాండు చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వర్షంలోనూ టవర్‌క్లాక్‌సెంటర్ నుంచి రైల్వేస్టేషన్, సంఘం థియేటర్, రాజావీధి మీదుగా టవర్‌క్లాక్‌సెంటర్ వద్దకు చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు. గూడూరును తిరుపతిలో కలపడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా నెల్లూరుతో ఉన్న అనుబంధాన్ని కొనసాగిస్తూ ఇటు విలీనం చేయాలన్నారు. తద్వారా ఎన్నికలకు ముందు చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. గూడూరు ప్రజల ఆకాంక్షను నెరవేర్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవో శిరీషకు వినతిపత్రం అందజేశారు. పవన్, దశరథరామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వేగూరు రాజేంద్రప్రసాద్, బాలకృష్ణంరాజు, మోహన్‌దాస్, చిరంజీవి, జమాలుల్లా, కోడూరు మీరారెడ్డి, ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు.

2,43,184 మందికి పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం ఉదయం 8 గంటలకు పింఛన్ల పంపిణీ మొదలైంది. వర్షం పడుతున్నా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించారు. మొత్తం 2,62,108మందికిగాను సాయంత్రం 7 గంటలకు 2,42,935 మందికి (92.78శాతం) రూ.104.16 కోట్లను పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి తెలిపారు. తిరుపతి నగరం జీవకోనలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పలువురు కార్పొరేటర్లు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఇన్‌చార్జి జేసీ మౌర్య తదితరులు పింఛన్లను పంపిణీ చేశారు.



ఐఐటీలో కాన్ఫరెన్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

త్వరలో కొత్త పరిశ్రమలు

● ఐఐటీ కాన్ఫరెన్స్‌లో మంత్రి నారాయణ

ఏర్పేడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీకి త్వరలో కొత్త పరిశ్రమలు రానున్నాయని, తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర మంత్రి నారాయణ చెప్పారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో 8వ భారతీయ లీన్ కన్‌స్ట్రక్షన్ కాన్ఫరెన్స్‌లో భాగంగా రెండో రోజైన సోమవారం జరిగిన ఇండస్ట్రీ డే సదస్సులో ఆయన మాట్లాడారు. పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఎంతో కృషిచేస్తున్నారనిచెప్పారు. ప్రతి ఇంటి నుంచీ ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఏపీ ప్రభుత్వం లీన్ కన్‌స్ట్రక్షన్ ప్రక్రియలను అమలు చేసి నిర్మాణరంగంలో సామర్థ్యాన్ని పెంచడం, వ్యర్థాలను తగ్గించడంపై దృష్టి సారిస్తోందన్నారు. ప్రభుత్వం తరఫున హాజరైన నిపుణులతో లీన్ కన్‌స్ట్రక్షన్ ఆవిష్కరణలు, ఉత్తమ పద్ధతులపై ఆయన చర్చించారు. విద్యారంగంలోని పరిశోధనలను, పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేయాలనే లక్ష్యమని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ ఇండస్ట్రీడే భారత నిర్మాణ రంగ భవిష్యత్తును సుస్థిరంగా తీర్చిదిద్దేందుకు అకడమిక్ కఠోరతను, పరిశ్రమను ఉత్తమంగా మార్చడంలో ఐఐటీ చేస్తున్న ప్రయత్నాలను వివరించారు. పారిశ్రామికవేత్త అనుప్ మాథ్యూ, ఐఎల్‌సీఈ సెక్రటరీ జనరల్ కైజాద్ కరంజావాలా తమ అభిప్రాయాలను పంచుకున్నారు.


సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.47 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,187

తలనీలాలు సమర్పించినవారు: 25,027





నీటి ఏనుగు



అడవి జింక



విదేశాల నుంచి తెచ్చిన మీర్‌కాట్ పిల్లలు



బూడిదరంగు కోళ్లు



చుక్కల దుప్పి పిల్లలు



అడవిపందులు



అడవిదున్న



థామిన్ జింక

కొత్త ప్రాణులకు పురుడుపోస్తున్న జూపార్కు

ఆసియా ఖండంలో అతిపెద్దదైన శ్రీవేంకటేశ్వర జూపార్కులో జంతు సంతతి క్రమంగా పెరుగుతోంది. 85రకాల వన్యప్రాణులున్న తిరుపతి జూలో వయసు, అనారోగ్య కారణాలతో కొన్ని మృతి చెందుతున్నాయి. మరోవైపు ఉన్న వన్యప్రాణులు కొత్తవాటికి జన్మనిస్తూ సంతతిని పెంచుకుంటున్నాయి. ఇతర దేశాల నుంచి తీసుకువచ్చినవి, మనదేశంలోని ఇతర జూల నుంచి తీసుకువచ్చిన వన్యప్రాణుల్లో మీర్‌కాట్, అడవి దున్న, బూడిదరంగు అడవి కోడి, నీటి ఏనుగు, అడవి జింక, అడవి పంది, చుక్కల దుప్పి, థామిన్ జింక వంటివి ఇక్కడే సంతానాన్ని వృద్ధి చేసుకున్నాయి. ఇతర దేశాల నుంచి వచ్చి ఇక్కడి వాతావరణంలో ఇమడలేని కొన్ని ప్రాణులు మరణించాయని, రెండు నెలలలోనే మరి కొన్ని ఇక్కడే కొత్తవాటికి జన్మనిచ్చాయని తిరుపతి జూపార్క్ అసిస్టెంట్ క్యూరేటర్ జగదీష్ చంద్రప్రసాద్ తెలిపారు. ఇక్కడే పుట్టిన ప్రాణులు ఈ వాతావరణానికి అలవాటు పడినట్లే. అవి ఆరోగ్యంగా పెరుగుతాయి. అని ఆయన చెప్పారు. ఇతర జూల నుంచి వచ్చిన వాటి కోసం కొత్త ఎన్‌క్లోజర్‌లు సిద్ధం చేస్తున్నామని చంద్రప్రసాద్ తెలిపారు.

- మంగళం, ఆంధ్రజ్యోతి

పాపవినాశనం డ్యాం ఎంత భద్రం?

● అధ్యయనం చేస్తున్న కేంద్ర శాస్త్రవేత్తలు

తిరుమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పాపవినాశనం డ్యాం పటిష్టత ఏ స్థితిలో ఉందో కేంద్ర ప్రభుత్వ సంస్థ సాయిల్ అండ్ మెటీరియల్ రిసెర్చ్ స్టేషన్ (సీఎస్‌ఎంఆర్‌ఎస్) శాస్త్రవేత్తల బృందం పరిశీలిస్తోంది. 42 ఏళ్ల కిందట తిరుమల నీటి అవసరాల కోసం నిర్మించిన ఈ డ్యామ్ భద్రతపై టీటీడీ దృష్టి పెట్టింది. ఏపీ జలవరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడు కూడా ఈ ఏడాది ఫిబ్రవరిలో పాపవినాశనం డ్యాంను పరిశీలించారు. డ్యాం గేట్లలో కొన్ని భాగాలు దెబ్బతిన్నాయని, మరమ్మతులు చేస్తే మరో 30 ఏళ్ల దాకా ఇబ్బంది లేదని సలహా ఇచ్చారు. అలాగే నేషనల్ డ్యాం సేఫ్టీ యాక్ట్ కింద కేంద్ర జలశక్తి విభాగానికి చెందిన సీఎస్‌ఎంఆర్‌ఎస్ ను అధ్యయనం చేయాల్సిందిగా టీటీడీ కోరింది. ఇందులో భాగంగా నవంబరు 26 నుంచి జలవనరుల శాఖ సీఈ వరప్రసాద్, ఎస్‌ఈ రాధాకృష్ణ మూర్తి, ఈఈ రవిశంకర్‌రెడ్డి, టీటీడీ ఈఈ సుధాకర్ ఆధ్వర్యంలో సీఎస్‌ఎంఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు సెంథిల్, జాలే లింగేస్వామి, దీపక్‌కుమార్ శర్మ బృందం పాపవిశానం డ్యాంను పరిశీలిస్తోంది. డ్యాములో నీటి కిందభాగానికి రిమోట్ ద్వారా ఒక యంత్రాన్ని పంపారు. కిందభాగంలోని పలు ప్రాంతాల్లో ఫొటోలను తీస్తున్నారు. డ్యాం అడుగుభాగం ఎంత పటిష్టంగా ఉందో దీనిద్వారా నిర్ధారించుకుంటారు. మరో రెండు రోజుల్లో పరిశీలనను పూర్తిచేసి నివేదికను రాష్ట్ర జలవనరుల శాఖ విభాగానికి అందజేయనున్నారు.

తిరుమలలో 5 డ్యాములు: తిరుమల కొండపై ప్రస్తుతం ఐదు డ్యాములు ఉన్నాయి. 1963లో గోగర్భం డ్యామును నిర్మించింది. ఆతర్వాత భక్తుల సంఖ్య పెరగడంతో 1983లో పాపవినాశనం డ్యామును నిర్మించారు. 2002లో ఆకాశగంగ, 2011లో జంటప్రాజెక్టులుగా పిలిచే కుమారధార, పసుపుధార డ్యాములను నిర్మించారు. వీటి మొత్తం నిల్వ సామర్థ్యం 14,303 లక్షల గ్యాలన్లు.





పాపవినాశనం డ్యాం వద్ద సీఎస్‌ఎంఆర్‌ఎస్ బృందం - నీటిలోకి పంపుతున్న రిమోట్ ఆపరేట్ వెహికల్

డయల్ యువర్ సీఎండీకి 62 వినతులు



వినియోగదారుల సమస్యలు వింటున్న సీఎండీ శివశంకర్

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమానికి 62 వినతులు వచ్చాయి. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో 9 జిల్లాల నుంచి వినియోగదారులు ఫోన్ ద్వారా తమ సమస్యలను సీఎండీ లోతేటి శివశంకర్ దృష్టికి తెచ్చారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, కాలిన, చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లు త్వరగా మార్చాలని, విద్యుత్ లైన్లు మార్పు చేయాలని, లోఓల్టేజ్ సమస్యలు పరిష్కరించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని సీఎండీ హామీ ఇచ్చారు. గతనెల 24వ తేదీ వరకు వచ్చిన 265 ఫిర్యాదుల్లో 118 పరిష్కరించామన్నారు. వినియోగదారులు సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్లు 1912, 1800 425155333కి కాల్ చేసి, సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అలాగే 9133331912కు చాట్‌చేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, పి.అయూబ్‌ఖాన్, కె.రామమోహనరావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఎస్.శోబావాలంటీనా, పి.హెచ్.జానకిరామ్, ఎం.మురళీకుమార్, పి.సురేంద్ర నాయుడు, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, జీఎంలు జి.చక్రపాణి, ఎం.కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, డి.సురేంద్రరావు, పి.భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, వెంకటరాజు, విజయన్ పాల్గొన్నారు.

‘గూడూరు’ సమస్య పరిశీలించండి

● మంత్రి అనగానికి ఎమ్మెల్యే సునీల్ వినతి

● సత్యవేడులో ఇన్‌చార్జి చెప్పినట్లు వినాల్సిందేనన్న అనగాని

● తిరుపతిలో టీడీపీ శ్రేణులు, ప్రజల నుంచి విజ్ఞప్తుల స్వీకరణ

తిరుపతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతికి సుమారు మూడు నెలల తర్వాత సోమవారం వచ్చిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ బిజీబిజీగా గడిపారు. ఉదయం జీవకోనలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఆయన రేణిగుంట రోడ్డులోని టీడీపీ పార్లమెంటు కార్యాలయానికి చేరుకున్నారు. ఆ పార్టీ నేతలు, శ్రేణులు, ప్రజలను కలుసుకున్నారు. గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరుజిల్లాలో విలీనంచేసేఅంశాన్ని పరిశీలించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ మంత్రిని అభ్యర్థించారు. పలువురు నాయకులతో కలసి బృందంగా వచ్చిన ఆయన మంత్రి ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చంద్రబాబు, లోకేశ్ ఎన్నికల్లో హామీలిచ్చారని గుర్తుచేశారు. మంత్రుల ఉపసంఘం తొలుత చేసిన సిఫారసుల్లో గూడూరు విలీనం అంశంఉందని, తీరా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే సమయంలో దాన్ని పక్కన పెట్టిందని వాపోయారు. పార్టీ శ్రేణులతో పాటు ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి..తిరిగి నెల్లూరులో విలీనం చేసేలా ఒప్పించాలని కోరారు. మంత్రికి వినతిపత్రం కూడా అందజేశారు.

వైసీపీ నుంచీ వచ్చిన వారికే ప్రాధాన్యం: సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడు, పిచ్చాటూరు, నాగలాపురం మండలాల నుంచి పలువురు కార్యకర్తలు మంత్రిని కలిశారు. వైసీపీనుంచీ వచ్చినవారికే పనులు జరుగుతున్నాయని, సమన్వయకర్త వారినే వెంటపెట్టుకుని ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ‘ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చి, పనిచేసినవైసీపీవారికి ప్రాధాన్యం ఇవ్వాల్సిందే. ఎన్నికల తర్వాత చేరిన వారికి ఎలాంటి ప్రాధాన్యత ఇచ్చేది లేదు. అధిష్ఠానం సమన్వయకర్తగా నియమించిన శంకర్‌రెడ్డిమాటకే పార్టీలో విలువ ఉంటుంది. శ్రేణులు ఆయన్ను అనుసరించుకుని వెళ్లాలి. నానియోజకవర్గంలోనూ ఇలాంటి సమస్య ఉంది. నేనూ అధిష్ఠానం ఆదేశాల్ని గౌరవించి అందరినీ కలుపుకొని పోతున్నా’ అని మంత్రి సమాధానమిచ్చారు.

కార్పొరేటర్ అన్నా సంధ్యకు పరామర్శ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న జీవకోన కార్పొరేటర్ అన్నా సంధ్య ఇంటికెళ్లి మంత్రి అనగాని సత్యప్రసాద్ పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందంటూ వాకబు చేశారు. పార్టీతో పాటు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

టీడీపీ కార్యాలయానికి స్థల పరిశీలన: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ పరిధిలో టీడీపీ పార్లమెంటు కార్యాలయ భవనానికి ఇటీవల ప్రభుత్వం కేటాయించిన భూమిని మంత్రి అనగాని పరిశీలించారు. అనంతరం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కార్యాలయానికి చేరుకుని నేతలను కలుసుకున్నారు. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పనుసులేటి హరిప్రసాద్ నివాసానికీ మంత్రి వెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు జి.నరసింహ యాదవ్, సుగుణమ్మ, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి, సత్యవేడు టీడీపీ ఇంచార్జి శంకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, గంగమ్మ గుడి ఛైర్మన్ మహేశ్ యాదవ్, కార్పొరేటర్లు అన్నా అనిత, నరసింహాచారి, ఎస్కే బాబు, నరేంద్ర, నేతలు మబ్బు దేవనారాయణరెడ్డి, పులుగోరు మురళి, జేబీ శ్రీనివాస్ తదితరులున్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం

ఇద్దరు ‘ఎర్ర’ స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ సోమవారం రాష్ట్ర ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. చిత్తూరు ఎస్పీ తుషార్ దూడి కథనం మేరకు.. చిత్తూరు జిల్లా సదుం మండలం బోరగమందకు చెందిన పి.వెంకటరమణ, ఆ మండలానికే చెందిన మల్లెల హరినాథ్ 2018లో రొంపిచెర్ల పోలీసు స్టేషన్ పరిధిలో ఎర్రచందనం దుంగలు తరలిస్తుండగా అప్పటి పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో వారు బెయిల్‌పై బయటకు వచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు కేసును చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు బదలాయించారు. కొన్ని నెలలుగా ఇక్కడ కేసు విచారణ జరిగింది. కేసుకు సంబంధించి చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ, అప్పటి రొంపిచెర్ల ఎస్‌ఐ జయరాంనాయక్, ప్రస్తుత ఎస్‌ఐ హరిప్రసాద్, కోర్టు లైజనింగ్ కానిస్టేబుల్ రవి, నిందితులకు సంబంధించి సాక్ష్యాధారాలు కోర్టు ఎదుట సాక్ష్యాధారాలు హాజరుపరచారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.



నిందితులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

శ్రీవారి సేవలో ప్రముఖులు



కౌశల్



గౌతమ్ రాజు

తిరుమల, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సినీనటులు గౌతమ్ రాజు, కౌశల్, తెలంగాణ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడి ఉన్నారు.

ప్రొటోకాల్ పాటించరా?

● సురుటుపల్లి ఆలయ ఈవోపై ఎమ్మెల్యే ఆదిమూలం ఆగ్రహం

నాగలాపురం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, అధికారులకు మధ్య ప్రొటోకాల్ రగడ ముదురుతోంది. నాగలాపురం మండలం సురుటుపల్లిలోని పళ్లికొండేశ్వర ఆలయంలో ప్రొటోకాల్ పాటించడం లేదంటూ ఈవో లతపై సోమవారం ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండు రోజుల క్రితం ఆలయంలో శని ప్రదోష పూజల నిమిత్తం ముద్రించిన కరపత్రాల్లో స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం పేరు లేదంటూ కొందరు వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశారు. ఈ క్రమంలో సోమవారం ఆలయంలోని ఈవో కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుని ప్రొటోకాల్‌పై నిలదీశారు. ఈవో వ్యవహార శైలిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని, అసెంబ్లీలోనూ ఈ అంశాన్ని ప్రస్తావిస్తానని చెప్పారు. రాజకీయాలకు ప్రాధాన్యమిస్తూ ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారంటూ విమర్శించారు. పాలకమండలి ఆత్మీయ సమావేశం పేరుతో ఆలయంలో పార్టీ సమావేశాన్ని నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆలయ ట్రస్టు బోర్డు నియామకం నియమ నిబంధనలకు వ్యతిరేకంగా జరిగిందని ఆరోపించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో నిందితుడికి, మద్యం వ్యాపారాలు చేసుకుంటున్న వ్యక్తికి చైర్మన్‌గా ఎలా చోటు కల్పిస్తారని నిలదీశారు. గతంలో టీటీడీలో బంగారు నగల దొంగతనం కేసులో నిందితుడిని.. చెన్నైలో స్థిర నివాసమున్న మహిళను సభ్యులుగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. బోర్డు నిబంధనల మేరకు గిరిజనులకు ఎందుకు చోటు కల్పించలేదని అడిగారు. ప్రొటోకాల్ విషయమై దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ఫోన్ చేసి చెప్పారు. తగిన ఆధారాలతో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని మంత్రి సూచించినట్లు సమాచారం. కాగా, నూతన సంవత్సరంలో శివయ్య ఎలాఅనుగ్రహిస్తే అలా నిర్ణయం తీసుకుంటానని ఈ సందర్భంగా ఆదిమూలం పేర్కొనడం గమనార్హం. టీడీపీ నాయకులు మురళి, ఎస్‌ఎం సురేష్, మురళి, సర్పంచ్ కాంతమ్మ, సుబ్రహ్మణ్యం, అంబేడ్కర్ సంఘ నాయకుడు జై భీమ్ అధ్యక్షుడు ధన తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలోని కార్యాలయంలో ఈవోని నిలదీస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ఛైర్మన్ చెబితేనే చేశా: ఈవో

ఆలయ కరపత్రాలపై ఎమ్మెల్యే పేరును ముద్రించకపోవడంపై ఈవో లత వివరణ ఇస్తూ... ఛైర్మన్ చెబితేనే చేశానన్నారు. ఒకసారికి క్షమించాలని ఇంకెప్పుడు ఇలాంటి ఘటన పునరావృత్తం కాకుండా చూసుకుంటానంటూ ఎమ్మెల్యేకి చెప్పారు. ‘ఆలయాలకు ఛైర్మన్లు వస్తారు పోతారు. ఇక్కడ భక్తుల సేవే పరమావధిగా ఉండాలి. ఛైర్మన్ చెబితే తరతరాలుగా ఉభయదారులుగా వ్యవహరిస్తున్న వారిని కూడా మార్చేస్తారా?’ అంటూ ఈవో ఆగ్రహం వ్యక్తంచేశారు.

నకిలీ సీఐ అరెస్ట్

భాకరాపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య విభేదాలను ఆసరాగా చేసుకుని సీఐ అవతారంలో బెదిరించిన శివకుమార్‌ను అరెస్టు చేసినట్లు భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా తెలిపారు. ఆయన వివరాల మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ అప్పేపల్లెకు చెందిన రెడ్డి ఈశ్వర్, భానుశ్రీ దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. భానుశ్రీ తరఫున కేవీపల్లె మండలం చిన్నకమ్మపల్లెకు చెందిన శివకుమార్ తాను కడప స్పెషల్ బ్రాంచ్ సీఐగా పనిచేస్తున్నానని, భానుశ్రీని వేధిస్తే చర్యలు తప్పవని రెడ్డి ఈశ్వర్‌ను బెదిరించాడు. దీంతో శివకుమార్‌పై రెడ్డి ఈశ్వర్ భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి శివకుమార్ సీఐ కాదని నిర్ధారించుకుని అతని కోసం గాలింపు చేపట్టారు. భాకరాపేట సమీపంలోని మామా బావమరిది హోటల్ సమీపంలో సోమవారం అతన్ని అరెస్టు చేశారు. శివకుమార్ ఇంతకు ముందు ఉద్యోగం తీసిస్తానని కలకడ మండలానికి చెందిన అంజినేయులు దగ్గర రూ.8 లక్షలు తీసుకుని మోసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రాఘవేంద్ర, ట్రైనీ ఎస్‌ఐ రాఘవరెడ్డి పాల్గొన్నారు.



శివకుమార్‌ను అరెస్టు చూపుతున్న పోలీసులు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

వ్యవసాయశాఖ కార్యాలయంలో చోరీ యత్నం



వ్యవసాయశాఖ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సూళ్లూరుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. సోమవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన ఏవో కాంచన, సిబ్బంది తలుపు తాళాలు పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు, ఇతర విలువైన వస్తు సామగ్రి అలాగే ఉన్నాయి. దొంగలు చోరీకి యత్నించి వెనుదిరిగి వెళ్లి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ విత్తనాలతో మోసపోయాం
న్యాయం చేయండి



ఎస్ఐ బ్రహ్మనాయుడికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

సూళ్లూరుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలతో మోసపోయాం... మాకు న్యాయం చేయండి అంటూ సోమవారం రైతులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని కలిసి వినతిపత్రం అందజేశారు. మేలు రకం విత్తనాలంటూ నమ్మించి విక్రయించారని, నాటిన 20 రోజులకే వెన్ను తీసి పంట నాశనమయ్యే పరిస్థితికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం రైతులు బీజేపీ నాయకుడు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయాధికారి కాంచనకు వినతిపత్రం అందజేశారు. అలాగే ఎస్ఐకి ఫిర్యాదు చేశారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి



కార్యక్రమంలో న్యాయమూర్తులు వెంకటనాగపవన్, సులోచనారాణి

గూడూరు అర్బన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకుని హెచ్ఐవీ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగపవన్ అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ నిర్మూలన దినం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఎయిడ్స్ ప్రబలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. మందులు, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి సులోచనారాణి, అరవ పార్వతయ్య, రజనీకాంత్‌రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో ఆర్డీవో పర్యటన



వెదురుపట్టు రోడ్డులో పాలకాలువ వంతెనను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు శైలాకుమారి

దొరవారిసత్రం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కిరణ్మయి దొరవారి సత్రం మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. తనియాలి వద్ద కాళంగి నదిపై వంతెనను, వెదురుపట్టు రోడ్డులోని పాలకాలువ వంతెన, పూలతోట సమీపంలోని కన్నాకాలువ వంతెనను పరిశీలించారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో వర్షాలు అధికమైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఆమె వెంట తహసీల్దారు శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఎస్ఐ అజయ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ తదితరులు ఉన్నారు.

చేనేత కార్మికులకు సాయం అందించాలి

గూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు మగ్గం గుంటల్లో నీరు చేరడంతో పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం నాయకుడు శ్రీనివాసులు కోరారు. నియోజకవర్గంలోని చెన్నూరు, విందూరు, రెట్టపల్లి తదితర గ్రామాల్లో వర్షాల కారణంగా మగ్గం గుంటల్లోకి నీరు చేరడంతో పట్టు, గొడుగు, జరి దెబ్బతిని నష్టపోయామన్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన చేనేత కార్మికులను ఆదుకోవడంతో పాటు బియ్యం, నిత్యావసరాలను అందజేయాలని కోరారు.

తీరప్రాంత గ్రామాల్లో ముందస్తు చర్యలు



పాచ్చూరు గ్రామం వద్ద మామిడికాలువ రహదారిపై రాకపోకలను ఆపేస్తూ కంపచెట్లను అడ్డుగా వేయిస్తున్న తహసీల్దార్ హరికృష్ణ

పెళ్లకూరు, డిశంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తహసీల్దార్ హరికృష్ణ పలుశాఖల అధికారులతో కలిసి స్వర్ణముఖినది లోతట్టు గ్రామాల్లో పర్యటించారు. మామిడి కాలువ, పాలచ్చూరు కాలువలు, వాగులు పొంగి పొర్లే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమతం చేశారు. కలవకూరు, కప్పగుంటకండ్రిగ, పాలచ్చూరు గ్రామాల వద్ద స్వర్ణముఖినది, మామిడి కాలువ కాజ్‌వేలను తహసీల్దార్‌తో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్‌కుమార్ పరిశీలించారు. పాలచ్చూరు ఆనకట్ట, మామిడికాలువ రహదారులపై రాకపోకలను ఆపేశారు.

అల్లుడిపై అత్త దాడి

గూడూరు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్లుడిపై అత్త దాడి చేసిన ఘటన స్థానిక ఇందిరానగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. రెండో పట్టణ పోలీసుల వివరాల మేరకు... ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న రాజాకు అతని భార్యతో స్వల్పవివాదం ఏర్పడింది. అదే సమయంలో ఇంట్లో ఉన్న అత్త సుధారాణి కాగుతున్న నూనెను రాజా ఒంటిపై పోయడంతో ఆయనకు గాయాలపాలయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్లు ఛిద్రం



కోట మండలంలోని గూడలి, విద్యానగర్, బాలాయపల్లి బస్టాండ్ సమీపంలో చెరువులను తలపిస్తున్న ఆర్అండ్‌బీ రోడ్లు

కోట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గూడలి నుంచి సముద్ర తీరానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. గూడలి, విద్యానగర్ వద్ద రోడ్డు తెగిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా గూడలి, దక్షిణపాలెం వద్ద వారం రోజుల క్రితం విత్తిన పచ్చ విత్తనాలు వర్షం దాటికి పూర్తిగా దెబ్బతిన్నాయి.

బాలాయపల్లి: గూడూరు - వెంకటగిరి ప్రధాన రహదారిలో బాలాయపల్లి బస్టాండ్ సమీపాన పెద్ద గుంత ఏర్పడడంతో వర్షపు నీరు చేరి కుంటను తలపిస్తోంది. గుంతలోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 49 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.27.95లక్షలు మంజూరయ్యాయి. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, దశరధరామిరెడ్డి, వెంకటేశ్వర్లురాజు, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, జలీల్, కిషోర్‌నాయుడు, మట్టం శ్రావణి, తీగల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అనగానికి సన్మానం



మంత్రి సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సన్మానించారు. సోమవారం తిరుపతిలో మంత్రిని కలిసిన నెలవల సుబ్రహ్మణ్యం నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు.

ధాన్యం లారీ బోల్తా



నాయుడుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మేనకూరు పారిశ్రామికవాడ సమీపంలోని చలివేంద్ర వద్ద ధాన్యం లారీ బోల్తా పడింది. సోమవారం కడప జిల్లా బద్వేలు నుంచి చెన్నైకు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ మేనకూరు సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించండి

వెంకటగిరి, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని హ్యాండ్లూమ్స్ టెక్నాలజీ సమీపంలోని చెవిరెడ్డిపల్లి ప్రాంతంతో కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా యత్నాలు జరుగుతున్నాయని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య అన్నారు. సోమవారం ఆయన తహసీల్దారు నరసింహారావును కలిసి ఫిర్యాదు చేశారు. చెవిరెడ్డిపల్లి సర్వే నంబర్ 96లో సుమారు 4.5 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు సొంతం చేసుకొనేదానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఆ భూమిని పరిరక్షించి పార్కు ఏర్పాటు చేయాలని కోరారు.

ఎడ తెరపిలేని ముసురు

సూళ్లూరుపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులనుంచి ముసురు పట్టినట్లుగా వర్షం కురుస్తోంది. సోమవారం ఉదయం నుంచి తేలికపాటి జల్లులతో కూడిన వర్షం కురవగా మధ్యాహ్నం నుంచి ముసురు కొనసాగింది. దీనికి చలిగాలులు తోడవడంతో జనం ఇబ్బందులు పడ్డారు. వీడని వర్షంతో కాళంగి నదికి నీరు చేరింది. నెర్రికాలువ, పాముల కాలువల ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

వెంకటగిరి టౌన్: తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా ఎడ తెరపి లేకుండా వర్షం కురుస్తోంది. అధికారులు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేశారు. మండలంలోని అన్ని చెరువుల్లో నీరు చేరింది. రైతులు వరి నారుమళ్ల పనుల్లో నిమగ్నమయ్యారు. మగ్గం గుంతల్లో నీరు చేరడంతో ఉత్పత్తి నిలిచిపోయింది.

తడ: మండలంలో ముసురుపట్టింది. శనివారం నుంచి కురుస్తున్న మోస్తరు వర్షం సోమవారం కూడా కొనసాగింది. వర్షానికి చలిగాలులు తోడవడంతో జనజీవనానికి కొంత ఆటంకం ఏర్పడింది.

నాయుడుపేట: మండలంలో చల్లటి ఈదురుగాలులతో అడపదడపా వర్షం కురుస్తోంది. ఉంది. వీధులన్నీ చిత్తడిగా మారాయి. స్వర్ణముఖినది, మామిడి కాలువల్లో వరద ప్రవాహాన్ని తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు పరిశీలించారు.

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

చిట్టమూరు, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. సోమవారం మండలంలోని పలు వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు గ్రామాలను తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో ఉమామహేశ్వర రావు పరిశీలించారు. మల్లాం మార్గంలోని వరద తాకిడి ఉన్న గెరండాలు, రొయ్యల కాలువ, పలు చప్టాలను పరిశీలించారు. అనంతరం లోతట్టు గ్రామమైన పిట్టివానిపల్లిలో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

పార్టీలకు అతీతంగా ఉద్యమం

కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు కలపాలన్న డిమాండ్‌తో పార్టీలకు అతీతంగా ఉద్యమం చేపట్టాలని వైసీపీ నేత చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో పిలుపునిచ్చారు. అదే విధంగా కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లాలోనూ, బాలయపల్లి, డక్కిలి, వెంకటగిరి మండలాలను తిరుపతిలో కలిపి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని కోటేశ్వరరావు అన్నారు.

ఎస్వీయూ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా రాజేంద్రప్రసాద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా వై.రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. ఆంధ్రా యూనివర్సిటీలో బీఫార్మసీ, ఎంఫార్మసీ, పీహెచ్‌డీ పూర్తి చేసి అక్కడే ప్రొఫెసర్‌గా 36 ఏళ్లు పనిచేశారు. ఆంధ్రా వర్సిటీ ఫార్మసీ కాలేజీ ఫ్యాకల్టీ డీన్‌గా, ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. 2 పుస్తకాలు, 152 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. ఆయన పర్యవేక్షణలో 91 మంది పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎస్వీయూ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

అసత్య ప్రచారంపై న్యాయపోరాటం

డక్కిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తాను నిధులు దుర్వినియోగం చేశానని సోషల్ మీడియాలో కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, వారిపై న్యాయ పోరాటం చేస్తానని వెంబులూరు సర్పంచ్ చాముండేశ్వరి అన్నారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తాను వెంబులూరు పంచాయతీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తుంటే కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ జనరల్ ఫండ్‌తో పాటు 14, 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వినియోగించడం జరిగిందన్నారు. ఖర్చు చేసిన ప్రతి రూపాయికీ లెక్క ఉందని, తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

జోరు వానలోనూ పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, ఏఎంసీ చైర్మన్ రమేష్

సూళ్లూరుపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూళ్లూరులో సోమవారం జోరువాన కురుస్తున్నా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, నాయకులు ఆలీభాయ్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల అధికారిగా అల్లీబాషా

కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట మండల సచివాలయాల అధికారిగా అల్లీబాషా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. చిల్లకూరు మండలంలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న అల్లీబాషా పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.


పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బాస్ సంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధురెడ్డి కాలనీలో సోమవారం బాస్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో లక్ష్మీదంత వైద్యశాల సహకారంతో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు రవీంద్రబాబు, డాక్టర్ నిషాల్, సునీతమ్మ, సుప్రియ, శాంతి, యశ్వంత్ పాల్గొన్నారు.

కల్లోల భరితంగా సముద్రం



కోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో సముద్రం కల్లోల భరితంగా మారింది. సోమవారం సముద్రంలో భీకర శబ్దాలు చేస్తూ అలలు ఉవెత్తున ఎగిసిపడుతున్నాయి. శ్రీనివాస సత్రం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం గ్రామాల వద్ద సముద్రంలో భారీ అలలు ఎగిసిపడుతూ కొన్ని మీటర్లు ముందుకు వచ్చింది. ఎన్నడూలేని విధంగా సముద్రంలో అలలు సుడులు తిరుగుతూ తీరాన్ని తాకుతుండటంతో మత్స్యకార గ్రామాలు ఉలిక్కిపడ్డాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని మత్స్య కారులు భయాందోళనకు గురయ్యారు. పడవలు, వలలను ఒడ్డుకు చేర్చుకున్నారు. సముద్రంలో అలల ఉధ్రుతి పెరుగుతూనే ఉండటంతో తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో తీరప్రాంతంలో రెడ్ అలెర్ట్ ప్రకటించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఓజిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ నేపథ్యంలో తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో నారాయణరెడ్డి మండలంలో అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. సోమవారం వారు ఓజిలి, వెంకటరెడ్డిపాళెం, కురుగొండ, మానమాల తదితర గ్రామాలను సందర్శించి అక్కడి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రమాదకర స్థితిలో ఉన్న చెరువులను తహసీల్దారు, ఎంపీడీవో పరిశీలించారు. ఆయా గ్రామాల్లో అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. గత మూడు రోజులుగా తుపాను కారణంగా ముసురువేసి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని అన్ని చెరువులకు నీరు చేరింది. కాలువలు, కుంటలు, వరవలు, దొరువులు ప్రవహిస్తున్నాయి. కాగా, మామిడి కాలువ పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలను ముందు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కాలనీలకు రాకపోకలు బంద్

డక్కిలి, డిసెంబర్ 1(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండల పరిధిలోని పాతనాలపాడు గ్రామం వద్ద వెలికల్లు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎస్సీ, ఎస్టీ కాలనీలకు రాకపోకలు నిలిచి పోయాయి. తహసీల్దారు శ్రీనివాసులు, సీఐ రమణ, ఎస్ఐ శివశంకర్ సంఘటనా స్థలానికి చేరుకొని వెలికల్లు వాగు ఉధృతిని పరిశీలించారు.

17న అటవీ శాఖలో వేలం
370 వాహనాల విక్రయానికి ఏర్పాట్లు

మంగళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న వాహనాలను వేలం వేయనున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ 8 రేంజ్‌లలో పట్టుబడిన 370 వాహనాలను వేలం వేస్తున్నారు. అత్యధికంగా తిరుపతి రేంజ్ నుంచి 160 వాహనాలు వేలం వేస్తున్నారు. ఇందులో ద్విచక్ర వాహనాలు, కార్లు, జీప్‌లు, లారీలు, ఆటోలు, మినీలారీలు ఉన్నాయి. కొనుగోలు చేయాలనుకునే వారు ముందుగా ఆయా రేంజ్‌ల పరిధిలోని అటవీ శాఖ కార్యాలయాలకు వెళ్లి వాహనాలను పరిశీలించి, వేలం పాటలో పాల్గొనవచ్చు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

తడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హత్యకేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపిన వివరాల మేరకు... తడ మండల పరిధిలోని చేనిగుంటలో పంక్చర్ షాపు నిర్వహిస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన సహమద్ ఆలీతో గత నెల 26వ తేదీ సాయంత్రం మీజూరు ప్రతాప్ గొడవ పడ్డాడు. సర్దిచెప్పడానికి వచ్చిన కోగిలి రామయ్యతో పాటు సహమద్ ఆలీని ఇనుపరాడ్ కొట్టి గాయపరిచాడు. వారికి ఆస్పత్రికి తరలించగా సహమద్ ఆలీ (45) మృతి చెందాడు. ఈ కేసులో నిందితుడైన మీజూరు ప్రతాప్‌ను సోమవారం ఉదయం అండగుండాల గ్రామ సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు. నిందితుడిని పట్టుకోవడానికి కృషి చేసి సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ కొండపనాయుడును జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారని డీఎస్పీ చెంచుబాబు తెలిపారు.

మద్యం మత్తులో నదిలోకి దిగిన వృద్ధుడు
కాపాడిన పోలీస్, అగ్నిమాపక సిబ్బంది

నాయుడుపేట టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వృద్ధుడు స్వర్ణముఖినదిలో దిగి ఇరుక్కుపోయిన సంఘటన నాయుడుపేటలో జరిగింది. సోమవారం సాయంత్రం స్వర్ణముఖినదిలో అయ్యప్పస్వామి భక్తులు స్నానాలు చేస్తుండగా మద్యం మత్తులో ఉన్న వృద్ధుడు నదిలోకి దిగాడు. గమనించిన అయ్యప్ప భక్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి చేరుకున్న డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నదిలో బ్రిడ్జి కింద భాగంలో ఇరుక్కుపోయిన వృద్ధుడిని సురక్షితంగా బయటకు తీసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పేరు, చిరునామా చెప్పేందుకు ఆ వృద్ధుడు నిరాకరించాడు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి



మృతి చెందిన శరవణన్

సూళ్లూరుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేట్ బస్సు డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన సోమవారం సూళ్లూరుపేటలో చోటు చేసుకుంది. చెన్నై నుంచి నెల్లూరుకు ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండుకు చేరుకుంది. డ్రైవర్ శరవణన్(50) బస్సు దిగి మూత్ర విసర్జనకు వెళ్లొచ్చాడు. తిరిగి బస్సు బయలుదేరే సమయంలో గుండెపోటు రావడంతో స్టీరింగ్ పైనే వాలిపోయాడు. వెంటనే కండక్టర్, ప్రయాణికులు బస్టాండు సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శరవణన్ స్వస్థలం తమిళనాడులోని పెరియపాలెం గ్రామం అని తెలిసింది.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక 17వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికబద్ధంగా అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రతినెలా పింఛన్ల ద్వారా రూ.16.57 కోట్లు పంపిణీ చేస్తున్నామని, అలాగే ఈనెల నుంచి కొత్తంగా 70 మంది వితంతువులకు పింఛను అందజేస్తున్నామన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపే విషయాన్ని మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లి సాధించే వరకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, సోమిశెట్టి చెంచురామయ్య, బత్తిన ప్రణీత్, ఓంప్రకాష్, రవీంద్రరెడ్డి, శ్రీధర్, పూర్ణచంద్రరావు, గోపాల్‌రావు, మునిగిరీష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం



వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ నుంచి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ లక్ష్మీనారాయణ

గూడూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా బ్లడ్‌బ్యాంకు మెడికల్ ఆఫీస్ డాక్టర్ లక్ష్మీనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ మౌలాలి, సిబ్బంది బాబురావు, ఆదిశేషయ్య, దిలీప్ ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు. వీరిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, ఆర్ఎంవో డాక్టర్ ప్రసూన, వైద్యులు అభినందించారు.

బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జీఎంగా వెంకట శ్రీకుమార్

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ తిరుపతి జిల్లా(ఉమ్మడి చిత్తూరు జిల్లా) ప్రిన్సిపల్ జీఎంగా అల్లాడి వెంకట శ్రీకుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. ఇక్కడ ఉన్న అమరేంద్ర రెడ్డి నవంబరు 30న ఉద్యోగ విరమణ చేశారు.